ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
7
ఆదివారం 28 సెప్టెంబరు 2025



హైకోర్టు ఆదేశాలతో మంగళగిరి రూరల్ సీఐపై కేసు 14లో..

నేడు ఏపీ పీజీసెట్ రెండో దశ కౌన్సెలింగ్ షెడ్యూల్ 8లో..

స్థానిక సంస్థలకు.. మొండిచేయి!

ఏడాదిగా జమ కాని స్టాంప్ డ్యూటీ సర్‌చార్జి

- మూడు జిల్లాల్లో రూ.100 కోట్లుకు పైగా దస్తావేజు రుసుం బకాయి
- ప్రభుత్వం ఆదేశిస్తేనే ఖాజానాకు ప్రొసీడింగ్స్
- నిధుల లేమితో కునారిల్లుతున్న పురాలు, పంచాయతీలు



ప్రభుత్వం స్థానిక సంస్థలకు మొండిచేయి చూపుతోంది. ఏడాదిగా స్టాంప్ డ్యూటీ సర్‌చార్జీ మునిసిపాలిటీలు.. పంచాయతీలకు జమ కాలేదు. దీంతో నిధుల లేమితో స్థానిక పాలన కునారిల్లుతోంది. కొన్ని పంచాయతీలు, మునిసిపాలిటీలు కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితిని ఎదుర్కొంటున్నాయి. పారిశుధ్య పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. స్టాంప్ డ్యూటీ సర్‌చార్జి విడుదల చేయాలని స్థానిక సంస్థల పాలక వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నా వాటి మొర ఆలకించే పరిస్థితి కనిపించడం లేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సర్‌చార్జి బకాయి రూ.100 కోట్లకు పైగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

మునిసిపాలిటీలు, పంచాయతీలు, మండల, జడ్పీ ఖాతాలకు సర్‌చార్జి నిధులు 2024 జూలై నుంచి జమ కావడం లేదు. ఈ నిధులన్నీ ప్రభుత్వమే వాడేసింది. స్టాంపు డ్యూటీ సర్‌చార్జి నిధులు ప్రతి నెలా ప్రభుత్వ ఖజానా ద్వారా స్థానిక సంస్థలకు జమవుతాయి. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్థానిక సంస్థల వారీగా ప్రొసీడింగ్స్ ఖజానాకు పంపిస్తారు. ఖజానా శాఖ అధికారులు మునిసిపాలిటీలు, పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ ఖాతాలకు నిష్పత్తి ప్రకారం నిధులు జమ చేస్తారు. పంచాయతీ పరిధిలో జరిగే ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 1.5 శాతం సర్‌చార్జి మూడు భాగాలుగా విభజిస్తారు. ఇందులో మూడో వంతు పంచాయతీలకు.. ఒక వంతు చొప్పున జడ్పీ, మండల

(మిగతా 8వ పేజీలో)



నరసరావుపేట రిజిస్ట్రార్ కార్యాలయం

> మునిసిపాలిటీ, పంచాయతీ పరిధిలోని ఇళ్లు, స్థలాలు, అపార్ట్‌మెంట్లు, పొలాల క్రయ విక్రయాలు జరిగితే స్టాంపు డ్యూటీ సర్ చార్జీని స్థానిక సంస్థల ఖాతాలకు జమ చేయాలి. ఒక స్థిరాస్తి కోటి రూపాయలకు విక్రయం జరిగితే అందులో 1.5 శాతం అంటే రూ.1.5 లక్షలు సంబంధిత పంచాయతీ లేదా మునిసిపాలిటీ ఖాతాకు జమ చేయాలి. పంచాయతీ పరిధిలో జరిగే ఆస్తుల విక్రయాలకు సంబంధించి నిష్పత్తి ప్రకారం పంచాయతీతో పాటు మండల, జిల్లా పరిషత్తుల ఖాతాలకు సర్‌చార్జిలు జమ చేయాలి. విక్రయించిన ఆస్తి తాలూకా పేర్ల మార్పులు స్థానిక సంస్థలు చేయాలి. చట్ట ప్రకారం ప్రతి రిజిస్ట్రేషన్‌కు కచ్చితంగా నిర్ణయించిన శాతం సర్‌చార్జి స్థానిక సంస్థలకు జమ కావాల్సిందే.

అద్భుతంగా.. ఆర్టీసీ



సిటీ బస్‌స్టాప్ (ఊహాచిత్రం)

- కాలుష్య రహిత రవాణాపై కసరత్తు
- నవనగరాల్లో తొమ్మిది బస్‌స్టేషన్లు, డిపోలు
- అమరావతి శివార్లలో మూడు భారీ టెర్మినల్స్
- 165 ఎకరాలు కేటాయించాలని సీఆర్డీఏకి వినతి

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

ఎన్నో విశిష్టతలు.. మరెన్నో రకాల ప్రత్యేకతలతో యావత్ ప్రపంచాన్ని ఆకట్టుకునేలా రూపుదాలుస్తున్న రాజధాని అమరావతిలో రవాణా సదుపాయాలు ఏవిధంగా ఉంటాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. అన్ని రకాల రవాణా సౌకర్యాలను ప్రయాణికులకు.. ఆహ్లాదకరమైన అనుభూతులను పంచేలా ప్రయాణికులను మైమరిపించేలా సదుపాయాలను వినూత్నంగా విభిన్నంగా ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఇందుకోసం అమరావతిలో అద్భుతమైన రోడ్‌గ్రిడ్‌ను రూ.వేల కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం.. నగరానికి వాయు, రైలు, రోడ్డు కనెక్టివిటీలను విస్తృతంగా పెంచడంతోపాటు జల రవాణా సదుపాయాలను కల్పించి ప్రయాణికులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకోవాలని భావిస్తుంది. ప్రస్తుతం అమరావతి నిర్మాణపనులు ఊపందుకోవడంతోపాటు భూములను పొందిన కొన్ని సంస్థలు (మిగతా 8వ పేజీలో)



బస్ టెర్మినల్ (ఊహాచిత్రం)

అత్యాధునికంగా.. ఆహ్లాదకరంగా.. కాలుష్య రహితంగా.. ప్రపంచ రాజధానిగా రూపొందుతోన్న అమరావతికి ఏ మాత్రం తీసిపోనట్లుగా.. రాజధానిలో బస్‌స్టేషన్లు, డిపోలు, టెర్మినల్స్ నిర్మాణానికి ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు అమరావతిలో అవసరమైన భూములకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి ఏపీసీఆర్డీఏకు ఆర్టీసీ అధికారులు వినతి పత్రం అందజేశారు. ఒకవైపు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయాన్ని తలదన్నేలా విమానాశ్రయం, పెదపరిమి-నెక్కల్లు మధ్య 15 వందల ఎకరాల్లో రైల్వేస్టేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను మొదలుపెట్టింది. ఈ క్రమంలో ఆర్టీసీ కూడా ముందుకు వచ్చింది. అమరావతి 2.0లో రాజధానిలో వివిధ సంస్థలు భారీగా నిర్మాణాలు చేపడుతుండగా.. ఆర్టీసీ కూడా రాజధానిలో భావి రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూముల కేటాయింపుపై సీఆర్డీఏను ప్రత్యేకంగా కోరింది.

శంకర్‌విలాస్ ఆర్వోబీ పనుల వేగం పెంచాలి

- ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతోన్న ప్రజలు
- పనులను పరిశీలించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలు

గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ ఆర్వోబీ పనుల వేగం పెంచాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శనివారం ఆమె ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శంకర్ విలాస్ ఆర్వోబీ పనులను పరిశీలించారు. జీజీహెచ్ నుంచి బ్రాడీపేట - అరండల్‌పేట వరకు జరుగుతున్న పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. బ్రిడ్జి పనుల కారణంగా ట్రాఫిక్ డైవర్షన్‌తో వాహనచోదకులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు.. ప్రజలు పడుతున్న ఇక్కట్లు తన దృష్టికి వచ్చాయని అందుకే పనుల క్షేత్రస్థితిని తెలుసుకునేందుకు ప్రత్యేకంగా వచ్చినట్లు చెప్పారు. పనులు త్వరగా పూర్తి కావడానికి అవసరమయ్యే చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రూ.98 కోట్లతో 930 మీటర్ల పొడవునా బ్రిడ్జి పనులు చేస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ కార్యనిర్వహక ఇంజనీర్ సీ విశ్వనాథరెడ్డి కలెక్టర్‌కు వివరించారు. బ్రాడీపేట వద్ద కొంత స్థలం సమస్య ఉందని అది పూర్తి అయితే నిర్మాణానికి ఎటు వంటి ఆటంకం ఉండదని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈ చిన్నయ్య, ఏఈ సాయికృష్ణ, లక్ష్మీ ఇన్‌ఫ్రా డెవలపర్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్వోబీ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

జీఎస్టీ 2.0తో ధరలు తగ్గుదల

- ఒక్కో కుటుంబానికి నెలకు రూ.2 వేల ఆదా
- సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన
- కేంద్రమంత్రి పెమ్మసాని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ప్రచారాలు

గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో ధరలు బాగా తగ్గాయి.. ఒక్కో కుటుంబానికి నెలకు రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు ఆదా అవుతుంది.. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్, వస్త్రాలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి.. అంటూ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. గుంటూరులో శనివారం వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న వారు దుకాణాలను సందర్శించి జీఎస్టీ 2.0 అమలు తీరును పరిశీలించి ప్రజల అభిప్రాయాలను సేకరించి కరపత్రాలను పంపిణీ చేశారు. యాదవబజార్‌లోని శ్రీకృష్ణకల్యాణ మండపంలో నిర్వహించిన అవగాహన సదస్సులో పెమ్మసాని మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా ప్రజలు వాటిపై అవగాహన కలిగి ఉండకపోతే ఆ ఫలాలు అందవన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్‌అన్సారియా, మేయర్ కోవెలమూడి రవీంద్ర, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, జీఎస్టీ జాయింట్ కమిషనర్ గీత మాధురి, జీఎంసీ ఏసీ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

అన్నివర్గాల్లోనూ సంతోషం..

జీఎస్టీ 2.0తో వస్తువుల ధరలు తగ్గడంతో అటు సామాన్యులు, కొనుగోళ్లు పెరిగి ఇటు వ్యాపారులు సంతోషంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. స్థానిక లక్ష్మీపురంలోని హీరో షోరూం, ఆప్కో వస్త్రాలయం, ఖాదీ బండార్ షాపులను ఆయన సందర్శించి వ్యాపారులు, వినియోగదారులతో మాట్లాడారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు అందరూ చేనేత దుస్తుల్ని ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, భీమినేని చంద్రశేఖర్, ఈదర శ్రీనివాసరెడ్డి, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్ పాల్గొన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



గుంటూరు గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కామాక్షి దేవిగా అమ్మవారు అలంకరణ

వేడుకగా దేవీనవరాత్రులు

జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఆరో రోజు శనివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను అనుగ్రహించారు. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. కాళికాదేవిగా, మహాలక్ష్మీదేవిగా, సంతానలక్ష్మీదేవిగా, గాయత్రి దేవిగా, కామాక్షిదేవిగా, భద్రకాళిదేవిగా, భవాని దేవిగా అలంకరించారు.

- గుంటూరు(తూర్పు)



మంగళగిరి : లలితా త్రిపుర సుందరీగా కాళీమాత

డ్రెయిన్లలోనే.. తాగునీటి పైపులు



ఆనందపేటలో మురుగునీటి కాల్వలోనే పైపులైన్లు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరు

- తాగునీరు కలుషితం.. డయేరియా ముప్పు
- తరచూ ప్రబలుతున్నా స్పందించని జీఎంసీ

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డయేరియా.. కలరా.. నగరంలో తరచూ ప్రబలుతున్నాయి.. పలువురు మృతి చెందుతున్నారు.. వందల సంఖ్యలో బాధితులు ఆస్పత్రుల పాలవుతున్నారు.. ఇందుకు ప్రధాన కారణం తాగునీరు కలుషితమేనని నివేదికలు తేల్చాయి. అయినా గుంటూరు నగర పాలక సంస్థ అధికారుల్లో చలనం ఉండటంలేదు. పోయేవి ప్రజల ప్రాణాలే కదా అన్న నిర్లక్ష్య ధోరణిలో అధికారులు ఉన్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో డయేరియా కోరలు చాస్తున్నా.. తాజాగా కలరా కేసులు వెలుగు చూసినా అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడటంలేదనేందుకు డ్రెయిన్లలోని తాగునీటి పైపులే నిదర్శనమని ప్రజలు ఆరోపిస్తున్నారు. నగరంలో తరచూ ప్రమాద ఘంటికలు మోగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని.. అందుకే తరచూ వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల పాలవుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. గతంలో డయేరియాతో 43 మంది, ఇటీవల ఆరుగురు మృతి చెందారు. నగరంలో ప్రబలిన డయేరియాకు ప్రధాన కారణం డ్రెయినేజీల్లోని తాగునీటి పైపుల్లో లీకులని అధికారులు నిర్ధారించారు. అయితే ఇప్పటికీ ఆయా డ్రెయిన్లలోని తాగునీటి పైపులు మార్చలేదంటే అధికారులు నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. నగరంలోని ఆనందపేట, పాతగుంటూరు, సంగడిగుంట, బారా ఇమామ్ పంజా తదితర ప్రాంతాల్లో తాగునీటి పైపులు మురుగునీటి కాల్వల్లోనే ఉన్నాయి. అప్పట్లో రూ.10 కోట్లతో పైప్‌లైన్ల మార్పిడికి పెద్దఎత్తున హడావుడి చేశారు. అయితే డయేరియా కలకలం తగ్గడంతో ఆ పనులను అరకొరగానే వదిలేశారు. ఈ కారణంగానే మళ్లీ నగరంలో తాజాగా డయేరియాతో పాటు కలరా కలకలం రేగింది. ఇలా డయేరియా వచ్చినప్పుడు అధికారులు హడావుడి చేయడం.. ఆ తర్వాత పట్టించుకోకపోవడం సర్వసాధారణంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జీఎంసీ అధికారులు స్పందించి మురుగు నీటి కాల్వల్లోని తాగునీటి పైప్‌లైన్లను మార్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



సంగడిగుంటలో ఆంజనేయ స్వామి గుడి వద్ద...



సంగడిగుంటలో దుస్థితి

సంస్థలు పర్యాటకాభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలో పర్యాటకాభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యే సంస్థలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం పర్యాటకశాఖ అధికారులు, హౌస్‌బోట్స్, క్రూయిజ్ అభివృద్ధి, హౌస్‌బోట్స్ బిల్డర్స్ ఆపరేటర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో కృష్ణా నదీ తీరపు ప్రకృతి సౌందర్యం, సముద్ర తీరం, కృష్ణానది బ్యాక్‌వాటర్, మడ అడవులు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తాయని తెలిపారు. సూర్యలంక సముద్ర తీరం నుంచి నిజాంపట్నం వరకు క్రూయిజ్, హౌస్‌బోట్స్ కార్యకలాపాలకు అనువుగా ఉంటుందని చెప్పారు. ఈ మేరకు ప్రతిపాదన అందజేస్తే తగిన సహకారం అందిస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో సందర్శకులను ఆకర్షించేలా సూర్యలంక బీచ్‌కు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సూర్యలంక హౌస్‌బోట్స్ సర్వేలో పాల్గొనే వారి వివరాలను కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటకశాఖ జీఎం నాంచారయ్య, ఇతర రాష్ట్రాలకు చెందిన హౌస్‌బోట్స్ బిల్డర్‌లు, ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

లూథరన్ ఉన్నత పాఠశాల మూసివేతకు సిద్ధం

● రికార్డులు స్వాధీనం చేయాలని ఆర్జేడీ ఉత్తర్వులు

● డిప్యూటీ ఈవోకు బాధ్యతల అప్పగింత



లూథరన్ ఉన్నత పాఠశాల

యడ్లపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోనే తొలి ఉన్నత పాఠశాల.. లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల మూసివేతకు చర్యలు ప్రారంభమయ్యాయి. నరసరావుపేట డిప్యూటీ ఈవో సుభాని శనివారం పాఠశాలకు చేరుకుని రికార్డులను స్వాధీనం చేయాలని హెచ్ఎంను కోరారు. దీంతో పాఠశాల సిబ్బంది రికార్డులను అప్పగించే పనిలో నిమగ్నమయ్యారు. ఏడు దశాబ్దాలకు పైగా విద్యాబుద్ధులు అందించిన పాఠశాల.. ఏఈఎల్‌సీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా మూత వేయడం ఈ ప్రాంత వాసులను కలచి వేసింది. విద్యాశాఖ ఆర్జేడీ ఆదేశాల మేరకు రికార్డులను స్వాధీనం చేసుకుంటున్నామని డిప్యూటీ ఈవో సుభాని తెలిపారు. స్వాధీన ప్రక్రియ మూడు నుంచి నాలుగు రోజులు పడుతుందన్నారు. రికార్డులను స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో భద్రపరచనున్నట్లు వెల్లడించారు. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న హెచ్ఎం, ఇద్దరు ఎస్‌జీటీ లతోపాటు జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండర్లను వేరొక చోటకు బదిలీ చేయడం జరుగుతుందన్నారు. వీరంతా జిల్లా విద్యాశాఖాధికారికి ఇప్పటికే రిపోర్టు చేశారని.. త్వరలోనే వీరిని మరోచోట సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు.

ఏపీని క్రీడలకు కేంద్రంగా మారుస్తాం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

గుంటూరు (విద్య), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం క్రీడా రంగ అభివృద్ధి పట్ల ప్రత్యేక దృష్టి సారించిందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని క్రీడలకు కేంద్రంగా మారుస్తామని ఆయన పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలను పీవీఎన్ మాధవ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని రకాల క్రీడలకు అవసరమైన సదుపాయాలు రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్నాయని చెప్పారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. చిన్న వయసు నుంచే ప్రతిభావంతులైన ఆటగాళ్లను ఎంపిక చేసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా వారిని తీర్చిదిద్దుతామని మాధవ్ పేర్కొన్నారు. చెస్‌ను ప్రతి పాఠశాలలో భాగం చేయాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ఈగల్ ఐజీ ఆకే రవిక్రిష్ణ మాట్లాడుతూ, మానవ చరిత్రలో అత్యుత్తమమైన ఆటల్లో చెస్ ఒకటని అన్నారు. ఈ ఆట కేవలం వినోదం కోసమే కాదని, మానసిక శక్తిని పెంచే సాధనమని పేర్కొన్నారు. చెస్ ఓపిక, క్రమశిక్షణ, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే గుణాన్ని నేర్పుతుందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్నపీవీఎన్ మాధవ్



మాట్లాడుతున్న ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ

సాంఘిక పెట్టుబడే అభివృద్ధికి పునాది

● విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్



ప్రసంగిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేశ్

గుంటూరుకార్పొరేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ అనుభవాలను పరిశీలిస్తే సాంఘిక పెట్టుబడి ప్రబలంగా ఉన్న దేశాలే వేగంగా అభివృద్ధి చెందాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ పేర్కొన్నారు. భారతదేశంలో ప్రజలను కులాలు, మతాల వారీగా విభజించడం వల్లే త్వరగా అభివృద్ధి చెందలేకపోతున్నామని అన్నారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జరిగిన చేయూత ఫౌండేషన్ ప్రారంభోత్సవ సభకు రమేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1990లో భారతదేశం, చైనా తలసరి ఆదాయం చేరో 330 డాలర్లు ఉండగా, నేడు చైనా 14,800 డాలర్లకు చేరుకుందని చెప్పారు. భారతదేశం మాత్రం 2,600 డాలర్లకే పరిమితమైందని అన్నారు. భారత సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించడానికి చేయూత ఫౌండేషన్ లాంటి సంస్థలు ప్రధాన పాత్ర పోషించాలని, నైపుణ్యం గల విద్యను ప్రతిభ గల పేదలకు అందించాలని రమేశ్ కోరారు. అనంతరం మానవతావాది బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి మాట్లాడుతూ, నేటి విద్యాసంస్థలు నైపుణ్యాలు అందించకుండా డిగ్రీలను అందజేసే ఉత్పత్తి కేంద్రాలుగా కొనసాగుతున్నాయన్నారు. అత్యున్నత ప్రతిభ కలిగి పేదరికాన్ని అనుభవిస్తున్న విద్యార్థులకు వారు స్థిర పడే వరకు చేయూతనివ్వాలని కోరారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ, పాప పుణ్యాల పరిధిని దాటి దాతృత్వం వైపు అడుగులు వెయ్యాలని కోరారు. విద్య, పరిశోధనలపై పెట్టుబడులు పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, ప్రముఖ ఆడిటర్ టీజేపీఎస్ కళాశాల సెక్రటరి కె.వి బ్రహ్మం, కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకులు జాక్ క్లమాకస్, మానవత చైర్మన్ పావులూరి రమేశ్, నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి, కౌండిన్య ఐఏఎస్ వ్యవస్థాపకులు ఇ.వి. నారాయణ, ప్రముఖ విద్యా వేత్త కన్నా మాస్టర్ పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షత వహించారు.

అద్భుతంగా ఆర్టీసీ

(7వ పేజీ తరువాయి)

తమ కార్యాలయాలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొచ్చి పనులను చేపడుతున్నాయి. సీడ్‌యాక్సిస్ రోడ్డు వెంబడే తమకు భూములు కేటాయించాలని మరికొన్ని సంస్థలు ప్రభుత్వపెద్దలపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ క్రమంలో రాజధానిలో బస్‌స్టేషన్ల ఏర్పాటుకు 165 ఎకరాలను కేటాయించాలని ఏపీఎస్ఆర్టీసీ సీఆర్‌డీఏకు విన్నవించుకుంది. ఈ మేరకు ఆ సంస్థ ఎండీ ఈ ఏడాది జూన్‌లోనే లిఖితపూర్వక విజ్ఞాపనపత్రాన్ని సీఆర్‌డీఏకు అందజేసి, ఆ విషయాన్ని ప్రభుత్వపెద్దల దృష్టికి కూడా తీసుకెళ్లారు. రాజధాని అమరావతి నగరంలో తిరిగే సిటీ సర్వీసులన్నీ పూర్తిగా ఎలక్ట్రిక్ లేదా, బ్యాటరీ వాహనాల రూపంలోనే ఉంటాయి. దీనివలన అమరావతిలో కాలుష్యం గణనీయంగా తగ్గనున్నది. ఆర్టీసీ నుంచి మూడు నెలల క్రితం సీఆర్‌డీఏకు ఈ ప్రతిపాదనలు అందినప్పటికీ ఎందువలనో ఆ సంస్థకు భూ కేటాయింపులు చేయలేదు. ఆర్టీసీకి భూ కేటాయింపులు, బస్‌స్టేషన్లు, డిపోల ఏర్పాటు తదితరాలన్నీ కూడా రాష్ట్రప్రభుత్వ పరిధిలో ఉండే అంశాలే కాబట్టి.. ప్రభుత్వం ఒకింత జాప్యం చేస్తుండవచ్చని భావించాలి.

మూడు టెర్మినల్స్.. తొమ్మిది బస్‌స్టేషన్లు

నవ నగరాల్లో ఎక్కడికక్కడ అంటే బస్‌స్టేషన్, దానికి అనుబంధంగా డిపోను ఏర్పాటు చేసేలా ఆర్టీసీ అధికారులు ప్రణాళికలను రూపొందించారు. ఒక్కో నగరంలో బస్‌స్టేషన్‌కు ఐదెకరాలు, డిపోకు ఇంకో ఐదెకరాలు.. వెరసి ఒక్కోచోట పదెకరాల చొప్పున నవనగరాల్లో కలిపి 90 ఎకరాలను కేటాయించాలని ఆర్టీసీ కోరుతుంది. నగరానికి మూడు వైపులా మూడు భారీ ఇంటర్‌ఛేంజ్ టెర్మినల్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఒక్కో టెర్మినల్స్ కోసం 25 ఎకరాల వంతున మూడు టెర్మినల్స్‌కు కలిపి 75 ఎకరాలు అవసరమని ఆర్టీసీ భావిస్తుంది. ఈ టెర్మినల్స్‌లో సుదూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు దిగి అక్కడి నుంచి సిటీ సర్వీసులను వినియోగించుకుని రాజధాని నగరంలో తాము వెళ్లాల్సినచోటుకు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించారు.

- హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం రాయపూడి సమీపంలో ఓ టెర్మినల్
- బెంగళూరు, రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం నీరుకొండ, పెదపరిమి మధ్య ఓ టెర్మినల్
- ఉత్తరాంధ్ర, రేపల్లె ప్రాంతాల నుంచి వచ్చేవారి కోసం మంగళగిరి పశ్చిమ శివారులో మరో టెర్మినల్‌ను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ప్రతిపాదిస్తోంది.

ఏపీ ఎడ్‌సెట్ చివరి దశ
కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఏఎన్‌యూ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఎడ్‌సెట్-2025 చివరి దశ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రవేశాల కన్వీనర్ ఆచార్య స్వామి శనివారం విడుదల చేశారు. వెబ్ కౌన్సెలింగ్ కోసం అభ్యర్థులు ఈ నెల 29 నుంచి వచ్చే నెల 3లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థుల విద్యార్హతల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4 వరకు జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు వచ్చే నెల 5 నుంచి 7 వరకు వెబ్ ఆప్షన్స్ ద్వారా కళాశాలలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్‌లో మార్పులు చేసుకోవాలనుకుంటే వచ్చే నెల 8న చేసుకోవాలని ఆయన చెప్పారు. వెబ్ ఆప్షన్స్ ఇచ్చిన అభ్యర్థులకు వచ్చే నెల 10న ప్రవేశాలు కేటాయిస్తామని తెలిపారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులు అక్టోబరు 13న వారికి కేటాయించిన కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని చెప్పారు. అదేరోజు బీఈడీ తరగతులు ప్రారంభమవుతాయని కన్వీనర్ స్వామి పేర్కొన్నారు.

నేడు ఏపీ పీజీసెట్ రెండో దశ
కౌన్సెలింగ్ షెడ్యూల్

కళాశాలల్లోని పీజీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన రెండో దశ కౌన్సెలింగ్ షెడ్యూల్ ను ఆదివారం విడుదల చేస్తున్నట్లు ఏపీ పీజీసెట్-2025 కన్వీనర్ ఆచార్య రవికుమార్ శనివారం తెలిపారు. అభ్యర్థులు తమ పేర్లను ఈ నెల 29 నుంచి వచ్చే నెల 4లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థుల విద్యార్హతల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 30 నుంచి వచ్చే నెల 5 వరకు జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ ద్వారా వచ్చే నెల ఒకటి నుంచి ఐదులోపు కళాశాలలు నమోదు చేసుకోవాలని ఆయన వివరించారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ ద్వారా ఇచ్చిన కళాశాలల్లో ఏమైనా మార్పులు చేసుకోవాలనుకుంటే వచ్చే నెల 6న చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు వచ్చే నెల 8న ప్రవేశాలు కేటాయిస్తామని చెప్పారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులు వచ్చే నెల 8 నుంచి 11 లోపు వారికి కేటాయించిన కళాశాలల్లో రిపోర్ట్ చేయాలన్నారు. నూతన విద్యార్థులకు పీజీ తరగతులు వచ్చే నెల 8న ప్రారంభమవుతాయని కన్వీనర్ రవికుమార్ పేర్కొన్నారు.

'జ్యోతి'కి ఉద్యోగ కల్పన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంధత్వంతో బాధపడుతూ కుమారుని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్న పాముల పాటి జ్యోతికి ఉద్యోగం కల్పించారు. పాత గుంటూరులో నివాసం ఉంటున్న జ్యోతి గురించి 'పాపం జ్యోతి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రచురించగా.. ఈ కథనానికి రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పారిశుధ్య విభాగంలో ఔట్ సోర్సింగ్ విధానంలో జ్యోతికి ఉద్యోగం కల్పిస్తూ జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా దివ్యాంగులశాఖ సహాయ సంచాలకులు డి. దుర్గాబాయి మాట్లాడుతూ జ్యోతి ఎనిమిదేళ్ల కుమారుడు కొద్ది రోజుల క్రితం న్యూమోనియా వ్యాధికి గురికాగా జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందేటట్లు చేశారన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు .



జ్యోతికి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మోటారు సైకిల్ - కారు ఢీ : వ్యక్తి మృతి

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం కాకాని గ్రామం వద్ద మోటారు సైకిల్-కారు ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పిడుగురాళ్ళ మండలం జానపాడు గ్రామానికి చెందిన రహంతుల్లా (45) తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రహంతుల్లా తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని తొలుత నరసరావుపేటలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించే సమయంలో మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు ఒంగోలు కిమ్స్ ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న రాజేష్‌దిగా మృతుని బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నరసరావుపేట రూరల్ ఎస్సై కిషోర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



కొత్త అజయ్ (ఫైల్)

వినుకొండటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి యువకుడు మృతిచెందిన ఘటన వినుకొండలో శుక్రవారం జరిగింది. నూజెండ్ల మండలం ఓబనపాలెం గ్రామానికి చెందిన కొత్త అజయ్ (21) కుటుంబసభ్యులతో కలిసి గత ఏడేళ్లుగా బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో జీవనం సాగిస్తున్నారు. అతడి స్నేహితుడు అశోక్ గ్రామానికి సమీపంలో ఇటీ వల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం షాపును అద్దెకు తీసుకు న్నాడు. షాపుకు ఫ్లెక్సీలు కట్టేందుకు తోడుగా అజయ్‌ను తీసుకెళ్లాడు. ఫ్లెక్సీలు కడుతుండగా సమీపంలోని వీధిలైట్ల విద్యుత్ వైర్లు తగిలి అజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి పదో తరగతి విద్యార్థి మృతి

కారంపూడి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సరదాగా ఈతకు వెళ్లి ఓ బాలుడు మృతిచెందిన సంఘటన శనివారం కారంపూడిలో జరిగింది. నరసరావుపేటకు చెందిన ముగ్గురు బాలురు పదో తరగతి చదువుతూ దసరా సెలవులు నిమిత్తం వారి పెద్దమ్మ గారి ఊరైన కారంపూడికి చెందిన జాహీరా ఇంటికి వచ్చారు. దుస్తులు ఉతికేందుకు జాహీరా వెళుతుండగా ఆమెతోపాటు ఖాదర్‌వలి, నాగుల్‌మీరా, సయ్యద్ సత్తార్ సరదాగా ఈత కొట్టేందుకు వినుకొండ రోడ్డులో గల సాగర్ కుడికాలువకు వెళ్లారు. ఈత కొడుతూ ముగ్గురూ మునిగిపోయారు. స్థానికులు గమనించి ఖాదర్‌వలి, నాగుల్‌మీరాను రక్షించగా సయ్యద్ సత్తార్ నీటిలో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సత్తార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు గురై రైతు మృతి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురై రైతు మృతి చెందిన పిడుగురాళ్ల మండలంలోని చెన్నాయపాలెంలో శనివారం జరిగింది. చెన్నాయపాలెం గ్రామానికి చెందిన జంగిటి శ్రీనివాసరావు (45) తన బెండ తోటలో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు పోలీసులు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సంక్షేమ గ్రూపు డైరెక్టర్‌గా రాములు బాధ్యతలు



తుళ్లూరు సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కల్నల్ వెలుగోటి రాములు సీఆర్ డీఏ సామాజిక సంక్షేమ విభాగ గ్రూప్ డైరెక్టర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరిం చారు. బాధ్యతలు స్వీకరించడానికి ముందు సీఆర్‌డీఏలోని ముఖ్య అధికారులను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం, సీఆర్‌డీఏ సిబ్బంది రాములు ను చాంబర్‌లో కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు. అమరావతి రైతులు, వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం, రాజధానిలోని ఇతర వృత్తి పనివారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా రాములు పేర్కొన్నారు. అమరావతి ప్రాంత వాసుల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు, యువత, మహిళలకు విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానని ఆయన చెప్పారు.

స్థానిక సంస్థలకు మొండిచేయి!

(7వ పేజీ తరువాయి)

పరిషత్‌లకు విభజించి ఖాతాలకు జమ చేస్తారు. ఇక పట్టణ పరిధిలో ఆస్తుల క్రయవిక్రయాల సర్‌చార్జి మొత్తం మునిసిపాలిటీ ఖాతాకే జమ చేస్తారు. ఒక్క నరసరావుపేట మునిసిపాలిటీకి ఏడాదిగా సర్‌చార్జి నిధులు రూ.7 కోట్లు విడుదల కావాల్సి ఉంది.

నిధుల లేమితో..కునారిల్లుతున్నాయి

నిధుల లేమితో కొన్ని మునిసిపాల్టీల్లో జీతాలు సకాలంలో చెల్లించలేని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. రిజిస్ట్రేషన్ సర్‌చార్జికి సంబంధించిన ప్రొసీడింగ్స్ ఖజానాకు పంపించకుండా రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ ఆదేశించినట్లు సమాచారం. మళ్లీ ఆదేశాలు ఇచ్చే వరకు ప్రొసీడింగ్స్ నిలుపుదల చేయాలని ఆదేశించారు. సర్‌చార్జి నిధుల కోసం స్థానిక పాలక వర్గాలు, అధికారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నిధులు జమ కావాలంటే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి. ప్రభుత్వ అదేశాల వస్తే ప్రొసీడింగ్స్‌ను పంపుతామని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఎప్పటికి కరుణిస్తుందోనని సదరు పాలక వర్గాలు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు పశ్చిమ

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించేలా ప్రత్యేక కౌంటర్లు

● గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ రమేష్

గుంటూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నెలాఖరు నేపథ్యంలో వినియోగదారులు ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించేలా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ తెలిపారు. విద్యుత్ రెవెన్యూ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో బిల్లులు చెల్లించి వినియోగదారులు సంస్థకు సహకరించాలని కోరారు. అలానే ఫోన్‌పే, గూగుల్ పే వంటి డిజిటల్ పేమెంట్స్‌లో కూడా చెల్లించవచ్చని పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

ఉత్సవాలకు రావాలని కమిటీ నేతల విజ్ఞప్తి


సీఎం చంద్రబాబుకు ఆహ్వానం పలుకుతున్న ఉత్సవ కమిటీ నాయకులు, ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఘన చరిత్ర కలిగిన శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతోన్న నవరాత్రి మహోత్సవాలకు హాజరుకావాలని ముఖ్య మంత్రి చంద్రబాబుకు ఆలయ ఉత్సవ కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ నేతృత్వంలో ఉత్సవ కమిటీ నాయకులు కొనకళ్ళ సత్యం, కోట శెంకటశేషగిరి, వనమా నరేంద్ర పలువురు నాయకులు ఉత్సవాల బ్రోచర్ అందజేసి సీఎంకు ఆహ్వానం పలికారు.

వైద్య శిబిరంలో కలెక్టర్ తనిఖీ

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలందరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా కోరారు. పాత గుంటూరు యాదవ బజార్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని శనివారం కలెక్టర్ తనిఖీ చేశారు. నమోదు చేసిన ఓపీలో రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు చక్కటి వైద్యసేవలు అందించాలని వైద్యులను సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ అనారోగ్యంగా ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలని ప్రజలకు సూచించారు. ఆర్వో నీటిని, మున్సిపల్ నీటిని కాచి చల్లార్చి తాగాలని కోరారు. కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఎంహెచ్‌వో కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన భవన్ అభివృద్ధికి చొరవ చూపాలి

● కలెక్టర్‌కు జేఏసీ విజ్ఞప్తి

గుంటూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజనుల కోసం ఏర్పాటైన గిరిజన భవన్ అభివృద్ధికి ప్రత్యేకంగా చొరవ చూపాలని గిరిజన సంఘాల జేఏసీ నాయకులు శనివారం కలెక్టర్ అన్సారియాకు విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

సుప్రసన్నాచార్యులికి సాహితీ పురస్కారం


విశ్వనాథ సత్యనారాయణ పురస్కారం అందుకున్న సుప్రసన్నాచార్యులుకు సన్మానం

గుంటూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులు కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జాతీయ సాహితీ పురస్కారం అందుకున్నారు. ఈ నెల 7న జరగాల్సిన కార్యక్రమం వాయిదా పడింది. దీంతో శనివారం శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నారపల్లిలోని స్వాధ్యాయ సంస్థలో పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి సంస్థ తరపున మోదుగుల రవికృష్ణ, ఏల్చూరి మురళీధర్‌రావు, లక్ష్మణ చక్రవర్తి, కస్తూరి మురళీకృష్ణ, యాదగిరి, శ్రీనివాస్, ప్రజ్ఞభారతి అధ్యక్ష, కార్యదర్శులు శర్మ, ప్రగ్నాభారతి, ఆంధ్రభారతి నిర్వాహకులు వాడపల్లి శేషతల్పశాయి, వీరభద్రుడు, అరుణ్ మద్ది పాల్గొన్నారు.

బృందావన్ గార్డెన్స్‌లో వ్యక్తి అదృశ్యం


కళారు మురళి

గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బృందావన్‌గార్డెన్స్ మూడో లైనుకు చెందిన కొతారు మురళీకృష్ణ(50)అనే వ్యక్తి అదృశమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బృందావన్ గార్డెన్స్‌కి చెందిన మురళీకృష్ణకు జయలక్ష్మికి సుమారు 22 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక కుమార్తె ఉంది. మురళికృష్ణ కుటుంబంపై అంతస్తులో ఉంటుండగా, తల్లి కింది పోర్షన్‌లో ఉంటుంది. మురళీకృష్ణకు సుమారు ఏడాది క్రితం పక్షవాతం వచ్చింది అప్పటి నుంచి ఇంట్లో మంచంలోనే ఉంటున్నారు. అయితే ఈ నెల 11న సాయంత్రం భార్య జయలక్ష్మి కింది పోర్షన్‌లో ఉంటున్న ఆయన తల్లి వద్ద వదిలిపెట్టింది. అనంత రం రాత్రి 7 గంటల సమయంలో కిందికి వచ్చి చూడగా తన భర్త కనిపించ లేదు. దీంతో జయలక్ష్మి తన కూతురితో కలిసి చుట్టు పక్కల ప్రాంతాల్లో భర్త కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో బాధితురాలు జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు ఆయన ఆచూకీ తెలిసినవారు పట్టాభిపురం 868831345లో తెలియజేయాలని పోలీసులు కోరారు. కాగా మురళి అదృశ్యంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


వికాస్‌నగర్‌లో షిర్డీ సాయి మందిరంలో గాయత్రీ దేవిగా అమ్మవారు


ఎస్‌వీఎన్ కాలనీలో శ్రీవేంకటేశ్వర దేవాలయంలో భవానిదేవిగా అమ్మవారు


రవీంద్రనగర్‌లో శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో అన్నపూర్ణదేవిగా అమ్మవారు


చుట్టుగుంట పోలేరమ్మ ఆలయంలో శ్రీలలిత త్రిపురసుందరీదేవిగా అమ్మవారు

జగజ్జననికి.. జేజేలు

● వేడుకగా దేవీ నవరాత్రులు.. విద్యుద్దీప కాంతులతో ఆలయాలు
● కనువిందు చేస్తున్న అమ్మవారి అలంకరణలు


సిద్ధార్థనగర్‌లో కనకమహాలక్ష్మి ఆలయంలో లలితాదేవిగా అమ్మవారు


పొన్నూరు రోడ్డులోని శ్రీకనక దుర్గమ్మ ఆలయంలో శ్రీలలిత త్రిపురసుందరీదేవిగా అమ్మవారు


శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): భక్తులను కరుణించే జగన్మాత శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఆరో రోజున శనివారం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేశారు. గోపూజ, సువాసిని, కుమారి పూజలు, సువాసినులచే సామూహిక కుంకుమార్చనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవాలయాల్లో అమ్మ వారిని కాళికాదేవిగా, మహాలక్ష్మీ దేవిగా, సంతానలక్ష్మీ దేవిగా, గాయత్రి దేవిగా, కామాక్షీ దేవిగా, భద్రకాళీ దేవిగా, భవానీదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మ వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

● గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు శ్రీలలిత త్రిపుర సుందరీదేవిగా, శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● పొన్నూరు రోడ్డు సంగడిగుంట వద్ద నున్న శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ముత్తయిదువులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

● నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శనివారం శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దుర్గాదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కోట శేషగిరి, గౌరవ సలహాదారులు కొనకళ్ళ సత్యం, కన్వీనర్ కూనిశెట్టి చంద్రశేఖర్‌లు పలువురు నాయకులున్నారు.

ప్రజారోగ్య కార్మికుల త్యాగాలతోనే జాతీయస్థాయిలో ఖ్యాతి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర


పారిశుధ్య కార్మికులను సత్కరించిన నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య కార్మి కుల కష్టం, త్యాగాలతోనే గుంటూరు నగరం జాతీయ స్థాయిలో ఖ్యాతిని సాధించిందని, కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డు పొందడంలో కీలకమైన ప్రజారోగ్య కార్యదర్శులకు, కార్మికులకు స్వచ్ఛ అచీవర్స్ పేరుతో నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో నిరంతరం కృషి చేస్తున్న ప్రజారోగ్య కార్మికుల కష్టానికి చేతులెత్తి నమస్కరిస్తున్నామన్నారు. కార్మికులకు ఏ సమస్య ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కారం చేస్తామని తెలిపారు. అనంతరం 57 డివిజన్ల నుంచి ఒక్కో కార్మికులకు, ఐవీఆర్ఎస్‌లో ఉత్తమ స్థానం సాధించిన శానిటేషన్ కార్యదర్శులను సన్మానించి, జ్ఞాపిక అందించారు. తొలుత నాట్య గురువు ఖలీల్ నేతృత్వంలో శాస్త్రీయ నృత్యం, ప్రజా గాయకుడు రమణ నేతృత్వంలో జానపద నృత్యాలు, గీతాలు సభకు హాజరైన వారిని అలరించాయి. కార్యక్రమంలో ఏపీ హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, ఎంహెచ్‌వో (ఇన్‌చార్జి) రామారావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజారోగ్య కార్మికులు పాల్గొన్నారు.

బ్రాకీ థెరపీతో అవయవ సంరక్షణ సాధ్యం


ఆర్కా హాస్పిటల్‌లో కేక్‌కట్ చేస్తున్న డాక్టర్ రాజునాయుడు

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): బ్రాకీ థెరపీ ద్వారా కేన్సర్ సోకిన అవయవం తొలగించకుండానే వ్యాధిని నయం చేయవచ్చని ఆర్కా కేన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ డీఎస్ రాజునాయుడు తెలిపారు. నగరంలోని ఆర్కా కేన్సర్ హాస్పిటల్‌లో శనివారం రోగులకు బ్రాకీ థెరపీపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ హాస్పిటల్‌లో బ్రాకీథెరపీ ప్రారంభించిన 77 రోజుల్లోనే 101 మంది రోగులకు విజయవంతంగా చికిత్సలు అందించినట్లు డాక్టర్ రాజునాయుడు తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవా పథకం కింద ఆర్కా హాస్పిటల్‌లో కేన్సర్ వైద్యసేవలు అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ మాకినేని హేమంత్, డాక్టర్ పవన్ రాఘవ రెడ్డి, డాక్టర్ హిమనీ మంచాల పాల్గొన్నారు.

భావి ఉపాధ్యాయులకు శిక్షణతోనే మెరుగైన ఫలితాలు

● విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య
● ఏఎల్ బీఈడీ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు


మాట్లాడుతున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిరంతర శిక్షణతో భావి ఉపాధ్యాయులు మెరుగైన బోధన అందిస్తారని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. శనివారం స్థానిక లాడ్జిసెంటర్లోని ఏఎల్ బీఈడీ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎం ఏస్తేరు సునీల అధ్యక్షత వహించారు. లావు రత్తయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులపై వేల కోట్ల రూపాయల ఖర్చు పెడుతున్నప్పటికీ ఉపాధ్యాయుల్లో దాగి ఉన్న బోధనకు మరింత సాధన చేకూర్చేందుకు శిక్షణలు నిర్వహించకపోవడం దుర దృష్టకరమన్నారు. కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం కళాశాలకు సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్లాటినం జూబ్లీ పైలాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ రెక్టార్ కే రత్నషీలమణి, కళాశాల కరస్పాండెంట్ జి.పాల్ రత్నాకర్ పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా కల్పించేలా పోలీస్‌శాఖ పని చేయాలి

● ఎస్పీకి కేంద్ర మంత్రి పెమ్మసాని సూచన


మంత్రి పెమ్మసానిని మర్యాద పూర్వకంగా కలసిన ఎస్పీ వకుల్

గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలకు భరోసా కల్పించే విధంగా శాంతి భద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేయాలని ఎస్పీ వకుల్ జిందాల్‌కు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి, మొక్కను అందించారు. ఆయన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే కలెక్టర్ల సదస్సు అసెంబ్లీ సమావేశాలు వంటి వరుస కార్య క్రమాలతో ఆయన బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయా కార్యక్రమాలు ముగించుకున్న అనంతరం శనివారం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాంతి భద్రతల విషయంపై చర్చించారు.

గుంటూరులోనే కేరళ పంచకర్మ వైద్యసేవలు

● ఆయుర్వేద వైద్యుడు కొండా వెంకటేశ్వర్లు


శిబిరంలో మందులు అందజేస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద పంచకర్మ వైద్యసేవలు కోసం కేరళ వెళ్లాల్సిన అవసరం లేకుండా గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్‌లో రెండు తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన, అన్ని సౌకర్యాలతో కూడిన వంద పడకల ఆయుర్వేదిక్ హాస్పిటల్‌ను అందుబాట్లోకి తెచ్చినట్లు పంచకర్మ వైద్య నిపుణులు, డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. దేవి నవరాత్రుల సందర్భంగా శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఐదు నుంచి రాత్రి పది గంటల వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో హాస్పిటల్ చైర్మన్, ప్రధాన వైద్య నిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లుతో పాటు డాక్టర్ మౌనిక, రోగులకు నాడీ పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో మేనేజర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్‌లో ఘనంగా దాండియా ఉత్సవాలు


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో దసరా పండుగను పురస్కరించుకుని విద్యార్థులు నవరాత్రి వేడుకలు, దాండియా, బతుకమ్మ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య హాజరయ్యారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజున యూనివర్సిటీలో అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా లావు రత్తయ్య మాట్లాడుతూ నవరాత్రుల్లో ఆరో రోజు చాలా విశేషమైనదన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొంగరాలబీడు మహాప్రస్థాన అభివృద్ధికి దాతల చేయూత

● రూ.3లక్షల విరాళం


కమిటీ సభ్యులకు చెక్కును అందజేస్తున్న దాతలు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బొంగరాల బీడులోని మహా ప్రస్థాన అభివృద్ధికి దివంగత ఏలూరి సుబ్బారాయుడు ధర్మపత్ని చెన్నమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు కోడళ్ళు మనమలు, మనుమరాళ్ళు మూడు లక్షల రూపాయలు చెక్కును కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కల్లూరి రమణయ్య, ఏలూరి నరసింహారావు, కూనల మాలకొండయ్య నిమ్మగడ్డ అంకమ్మ చౌదరి, జంగా లపల్లి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిళ్లతో కూడిన జీవనశైలే గుండె జబ్బులకు కారణం

● కిమ్స్ కార్డియాలజిస్ట్ నాగశ్రీ హరిత


నగరంలో వాకథాన్ నిర్వహిస్తున్న కిమ్స్ వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడితో కూడిన జీవనశైలిలో గుండె వ్యాధులు తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు కిమ్స్ శిఖర హాస్పిటల్స్ కార్డియాక్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ నాగశ్రీ హరిత తెలిపారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా సమాజంలో హృదయ ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు కిమ్స్ శిఖర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం 'వరల్డ్ హార్ట్ డే వాకథాన్'ను నిర్వహించారు. మంగళదాస్ నగర్‌లోని కిమ్స్ ఆస్పత్రి దగ్గర వాక్‌ను ప్రముఖ నటి శివానీ నగారం ప్రారంభించారు. బీఆర్ స్టేడియం వరకు కొనసాగింది. కార్యక్రమంలో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శివప్రసాద్, కిమ్స్ హాస్పిటల్స్ యూనిట్ హెడ్ హరికుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారికి అవార్డు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం సంస్థలో భాగమైన గుంటూరు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారిని అవార్డు వరించింది. ఏరువాక ఫౌండేషన్ నిర్వహించిన కిసాన్ మహోత్సవం- 2025 కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోమువీర్రాజు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు చేతుల మీదుగా ప్రకృతి వ్యవసా య రాష్ట స్థాయి విస్తరణ అధికారిగా శనివారం అవార్డు అందుకున్నారు. రాజకుమారి గుంటూరు జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామీణ స్థాయిలో విస్తరించడానికి, రైతుల్లో అవగాహన పెంచడానికి చేసిన కృషిని గుర్తిస్తూ ఈ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏరువాక ఫౌండర్ రాఘవరావు, శాస్త్రవేత్త కవిత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష అస్థిత్వాన్ని పరిరక్షించుకోవాలి : ఎంవీఎస్ శర్మ

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రంపచీకరణ పోటీ యుగంలో తెలుగు జాతి అస్థిత్వం, తెలుగు భాష పరిరక్షణకు ప్రజలు మరో సంస్కరణ ఉద్యమానికి సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. గుంటూరులో గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం జాషువా జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ జర్నలిస్టు, విశ్లేషకులు, సాహితీవేత్త తెలకపల్లి రవికి జాషువా కవితా పురస్కారం అందజేశారు. సభకు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షత వహించారు.

స్త్రీ సాధికారతతోనే సమాజ పురోగతి

● ఎమ్మెల్యే గల్లా మాధవి


శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్త్రీ సాధికారతే సమాజ పురోగతి అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. తిరుపతిలో సెప్టెంబరు 14, 15 తేదీల్లో జరిగిన జాతీయ మహిళా సాధికారిత సదస్సు గురించి శనివారం అసెంబ్లీలో జరిగిన స్వల్ప కాల చర్చలో ఎమ్మెల్యే మాధవి ప్రసంగించారు. సమాజ పురోగతి, దేశ అభ్యున్నతి అనేవి ఆ దేశంలోని స్త్రీల స్థితిగతులపై ఆధారపడి ఉంటాయన్నారు. సీఎం చంద్రబాబునాయుడు మహిళలపై తీసుకుంటున్న నిర్ణయాలు, సంక్షేమ పథకాలు దేశంలోనే ఉన్నత స్థాయిలో ఉన్నాయని గల్లా మాధవి తెలిపారు.

మైనార్టీల జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తా

● మైనారిటీస్ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే నసీర్


మైనార్టీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణం చేస్తున్న ఎమ్మెల్యే నసీర్, పక్కన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గుంటూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తనకు ఇచ్చిన పదవిని బాధ్యతగా తీసుకుని ముస్లింల సంక్షేమం, జీవన ప్రమాణాల మెరుగుదల కృషి చేస్తానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా శనివారం వెలగపూడిలో అసెంబ్లీలో ఎమ్మెల్యే నసీర్ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి ముస్లింల జీవన ప్రమాణాలు పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయాలన్నారు. వాటిని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకురావాలని నసీర్‌కు సూచించారు. గత ప్రభుత్వంలో ముస్లింలకు తీవ్ర అన్యాయం జరిగిందని, కనీసం మౌజన్లు, ఇమామ్‌లకు గౌరవ వేతనం కూడా ఇవ్వలేదని లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మౌజన్లు, ఇమామ్‌లకు రూ.43 కోట్ల నిధులు విడుదల చేశామని వెల్లడించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రైల్వేస్టేషన్ తూర్పువైపున వాహనాల క్రమబద్ధీకరణ


గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ రద్దీ దృష్ట్యా గుంటూరు రైల్వే స్టేషన్ తూర్పు వైపున వాహనాలను క్రమబద్ధీకరిస్తున్నట్లు గుంటూరు డివిజనల్ ప్రజా సంబంధాల అధికారి డీ.వినయ్‌కాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రమబద్ధీకరణ అంటే కొన్ని ఆంక్షలు అమలు చేస్తామన్నారు. ప్రయాణికులు, వాహనదారులు సులభతరంగా రాకపోకలు సాగించేలా చూస్తామన్నారు.

సాగర్‌లో 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల




విజయపురిసౌత్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్టు అధికారులు శనివారం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయం నీటిమట్టం 587.30 అడుగులుగా ఉంది. ఇది 305.68 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8,023 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,373 క్యూసెక్కులు, 26 క్రస్ట్‌గేట్లను పది అడుగులు మేర ఎత్తి 3,76,402 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్ ఫ్లో వాటర్‌గా 4,19,598 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 4,19,598 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 3,93,615 క్యూసెక్కుల నీటి విడుదల



రెంటచింతల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు శనివారం 3,93,615 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, సాయి నిరంజన్ చెప్పారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి ప్రాజెక్టుకు 3,92,999 క్యూసెక్కుల నీరు వచ్చిందని తెలిపారు. రిజర్వాయర్‌లో 74.73 మీటర్ల మేర నీరుండగా ఇది 6.560 టీఎంసీలకు సమానమని చెప్పారు. భారీ వరద కారణంగా ప్రాజెక్టులో విద్యుదుత్పత్తిని నిలిపివేసినట్లు తెలిపారు.


ప్రకాశం బ్యారేజ్ వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి



తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని భారీగా విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 3,83,961 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజీకి వచ్చి చేరుతోంది. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 3,75,125 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. తూర్పు డెల్టా కాలువకు 4,323 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదలను నిలిపివేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి కొనసాగుతుండడంతో దిగువ నదీ తీర ప్రాంత వాసులు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

వాహన విక్రయదారుల్లో..
దసరా జోష్

● పండుగ ఆఫర్లు, జీఎస్టీ తగ్గింపుతో ఊపందుకున్న కొనుగోళ్లు
● ఏడు రెట్లు పెరిగిన బైక్ అమ్మకాలు ● రూ.లక్ష వరకు తగ్గిన కార్ల ధరలు



షోరూమ్‌ల వద్ద పండుగ శోభ

గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ రాగానే మార్కెట్లు రద్దీగా మారుతాయి. ముఖ్యంగా వాహనాల అమ్మకాలు పెరగటం ప్రతి ఏటా కనిపిస్తుంది. ఈ సారి పండుగ ఆనందానికి తోడు జీఎస్టీ తగ్గింపు కూడా తోడైంది. పన్ను భారం తగ్గటంతో ప్రజలు కొత్త వాహనాల కొనుగోలుకు పోటెత్తుతున్నారు. ఫలితంగా జిల్లాలోని వాహనాల అమ్మకాలు ఐదు నుంచి ఏడు రెట్లు పెరిగాయి. షోరూమ్‌లు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతున్నాయి.

● రికార్డుస్థాయిలో ద్విచక్రవాహనాల అమ్మకాలు

జిల్లాలో ద్విచక్రవాహనాల విక్రయాలు ఏడు రెట్లు పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. గుంటూరులోని టీవీఎస్ షోరూమ్‌లలో జీఎస్టీ తగ్గింపునకు ముందు రోజుకు 15-20 ద్విచక్రవాహనాలు అమ్ముడయ్యేవి. అయితే జీఎస్టీ అమల్లోకి వచ్చిన 22వ తేదీ తర్వాత రోజుకు 120 నుంచి 130 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ఇదే పరిస్థితి హీరో, హోండా, బజాజ్ షోరూమ్‌లలో కూడా కనిపిస్తోంది. ప్రధానంగా యూనికార్న్, పల్సర్ 150 సీసీ బైక్‌ల ధరలు రూ.10వేల వరకు తగ్గటంతో యువత వాటిపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటి వరకు బైక్ కొనాలని అనుకున్నా ధరలు ఎక్కువగా ఉండటంతో వాయిదా వేసుకున్నామని, ఇప్పుడు జీఎస్టీ తగ్గింపుతో పాటు దసరా ఆఫర్ కూడా కలుపుకొని తక్కువ ధరకు వస్తుండటంతో వెంటనే బుకింగ్ చేసేశాం అని పలువురు యువకులు చెబుతున్నారు.

● కార్ల అమ్మకాలకు ఊపిరి....

జీఎస్టీ తగ్గింపుతో కార్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగాయి. కార్ల ధరలు రూ. లక్ష వరకు తగ్గడంతో ముఖ్యంగా మధ్య తరగతి కుటుంబాల వారు కొత్త కార్ల కొనుగోలుకు ముందుకొస్తున్నారు. షోరూమ్‌లు జీఎస్టీకి ముందు, తరువాత ధరల వ్యత్యాసాలను ప్రత్యేక బోర్డులపై ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. కస్టమర్లకు ధరల తగ్గింపును స్పష్టంగా తెలియజేసేందుకు ప్రత్యేకంగా డిస్‌ప్లే బోర్డులు డీలర్లు ఏర్పాటు చేస్తున్నారు. జీఎస్టీ సంస్కరణల ప్రభావాన్ని ప్రజలకు దగ్గర చేయటానికి ప్రచార రథాలను కూడా సిద్ధం చేశామని కారు షోరూమ్ నిర్వాహకులు తెలిపారు. అమ్మకాలు ఊహించని రీతిలో పెరగటంతో రవాణాశాఖ కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసింది. వాహన యజమానులకు ఎక్కువ సమయం వృథా కాకుండా డిజిటల్ పద్ధతులను వినియోగించి రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తున్నామని అధికారులు తెలిపారు.

● కొత్త కార్లు కొనలేని వారికి అందుబాటులోకి పాత కార్లు

జీఎస్టీ తగ్గింపుతో కొత్త కార్ల ధరలు దిగిరావటంతో ఇప్పటి వరకు పాత కార్లకు ఉన్న రేటు మరింతగా పడిపోయింది. ఇప్పటి వ రకు కొనాలనే ఆలోచన లేని వారు కూడా తమ కారు మోజు తీర్చుకునేందుకు పాత వాటిని కొనేందుకు ముందుకొస్తున్నారు. దీంతో ప్రస్తుతం కొత్త-పాత కార్ల మార్కెట్ జోరందుకుంది.

● ఐదు రోజుల్లోనే భారీ విక్రయాలు

కొత్త జీఎస్టీ అమల్లోకి వచ్చిన తరువాత కేవలం ఐదు రోజుల్లోనే జిల్లాలో 1900 మోటార్ సైకిళ్ళు, 90 కార్లు, క్యాబ్‌లు, 10 ట్రాక్టర్‌లు, 67 ఆటోలు, 47 గూడ్స్ వాహనాలు, 15 ఆటో గూడ్స్ వాహనాలు, 12 ఇతర వాహనాలు రవాణాశాఖ గణాంకాల ప్రకారం అమ్ముడయ్యాయి. ఈ స్థాయిలో అమ్మకాలు జరగటం గతంలో ఎప్పుడూ చూడలేదని అధికారులు చెబుతున్నారు.

అమ్మకాలు బాగా పెరిగాయి
- జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి



జిల్లాలో వాహనాల అమ్మకాలు దాదాపు ఐదు నుంచి ఏడు రెట్లు పెరిగాయి. ముఖ్యంగా కార్ల ధరలు రూ. లక్ష వరకు తగ్గటంతో వాటిపై కొను గోలుదారులు ఆసక్తి చూపుతున్నారు. జీఎస్టీకి ముందు ఆ తరువాత ధరల వ్యత్యాసాలను తెలిపే బోర్డులను షోరూమ్ వద్ద ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. అలాగే ప్రచార రథాలను కూడా ఏర్పాటు చేస్తున్నాం.

ఉద్యమాల పురిటి గడ్డ పల్నాడు

● పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రాభవాన్ని వివరించిన కలెక్టర్



కృతికా శుక్లా

నరసరావుపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాల పురిటిగడ్డ, పౌరుషానికి ప్రతీక పల్నాడు అని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శనివారం ఆమె పల్నాడు జిల్లా ప్రాభవాన్ని వివరించారు. ప్రపంచ పటంలో పల్నాడును ప్రత్యేక స్థానంలో నిలిపిన పల్నాటి నాయకులకు, కళాకారులకు, ప్రజలకు ప్రపంచ పర్యాటక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పల్నాడు ప్రాభవాన్ని గురించి వివరిస్తూ.. నకరికల్లు వరి ధాన్యం, లాలిపురం జామకాయలు, అడిగొప్పల రేగిపళ్ళు.. ఇలా ఎన్నో రకాల అంశాలకు పల్నాడు ప్రసిద్ధి అని చెప్పారు. తెలుగు భాష తొలి పదం "నాగబు" లిఖితరూపంలో అమరావతిలోనే కనబడిందని, బౌద్ధ మత స్తూపాల, శిథిలాల, ప్రాచీన అవశేషాల, గ్రంథాలు సమాచారాన్ని అమరావతి మ్యూజియం తెలియజేస్తుందన్నారు. రెండో బుద్ధుడు ఇండియన్ ఐన్‌స్టీన్‌గా పేరుగాంచిన ఆచార్య నాగార్జునుడు తిరగాడిన నేల పల్నాడని అన్నారు. రెడ్డి రాజుల రాజధాని కొండవీడు గురించి, శ్రీ నాథ కవిసార్వభౌముడి గురించి వివరించారు. చేజర్ల కపోతేశ్వరాలయం, గుత్తికొండ బిలం గురించి తెలియజేశారు. చాపకుడు సిద్ధాంతం ద్వారా సామాజిక న్యాయం కోసం పల్నాటి బ్రహ్మనాయుడు నిలబడ్డారని, అలాగే మహిళా మంత్రి నాగమ్మ గురించి తెలియ జేశారు. కారంపూడి, కోటప్పకొండ, గురజాల, సొలస తదితర ప్రాంతాల గురించి వివరించారు. కోహినూర్ వజ్రాన్ని ప్రపంచానికి అందించిన బెల్లంకొండ మండలం కోళ్లూరు పల్నాడులోనే ఉందని, బ్రిటీష్ వారిపై కన్నెర్ర చేసి ప్రాణ త్యాగం చేసిన పుల్లరి ఉద్యమ కొదమసింహం కన్నెగంటి హనుమంతు, అలాగే మహాకవి గుర్రం జాషువా పల్నాడు ప్రాంతం వారేనని చెప్పారు. సుగంధ ద్రవ్యాలకు యడ్లపాడు ప్రసిద్ధని, పులిచింతల చింతలు తీర్చే అమృతవాహినని అన్నారు. అలాగే నరసరావుపేటలోని రాజు గారి కోట, నిదానంపాటి అమ్మవారు కొలువైన అడిగొప్పల గురించి వివరించారు. హాస్య బ్రహ్మ బ్రహ్మానందం జన్మస్థలం ఇరుకుపాలెం అని, తెలుగు తమిళ, కన్నడ భాషలలో ప్రసిద్ధి గాంచిన గాయకుడు మనో పల్నాడు వాడేనని చెప్పడం గర్వంగా ఉందని చెప్పారు. దేశంలో అతి పెద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టు నాగార్జున సాగర్ పల్నాడులోనే ఉందని, అతిపెద్ద పులుల అభయారణ్యం నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్టని చెప్పారు. వేలాది మంది కార్మికులకు ఉపాధిని కల్పిస్తున్న స్పిన్నింగ్ మిల్లులు, ఎక్కువ సిమెంట్ ఫ్యాక్టరీలు పల్నాడులోనే ఉన్నాయని కృతికా శుక్లా తెలియజేశారు.

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బెంగుళూరుకు చెందిన తండ్రీ కుమారులను కిడ్నాప్ చేసి సంతమాగులూరు సమీపంలో జంట హత్యలకు పాల్పడిన కేసులో 12వ నిందితుడైన సంతమాగులూరుకు చెందిన గడ్డం ప్రభాకర్ రెడ్డిని శనివారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు వారు చెప్పారు. ఈ కేసులో మొత్తం 13 మందిని నిందితులుగా ఉన్నారని, వీరిలో ఇప్పటివరకు 11 మందిని అరెస్టు చేశామని తెలిపారు. మరో ఇరువురు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

గోవుల అక్రమ తరలింపును అడ్డుకున్న గో- పరివార్

● తాడేపల్లి పోలీసులకు అప్పగింత

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గోవులను హైదరాబాద్ కబేళాకు తరలిస్తున్న లారీని గో- పరివార్ సంస్థ ప్రతినిధులు శనివారం అడ్డుకున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి కనకదుర్గమ్మ వారధి వద్ద లారీని అడ్డుకున్న గో- పరివార్ రాష్ట్ర అధ్యక్షుడు తోట సురేష్‌బాబు పోలీసులకు సమా చారం అందించారు. పోలీ సు లు అక్కడకు చేరుకొని డ్రైవర్‌తోపాటు లారీని అదుపులోకి తీసుకున్నారు. గోవులను గోశా లకు తరలించారు. ఎటువంటి అనుమతి లేకుండా అక్రమం గా 52 గోవులను లారీలో కుక్కి తరలిస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో గో- పరివార్ సురేష్ పేర్కొన్నారు.



గోవులను తరలిస్తుస్తున్న లారీ

బాపట్ల తీరంలో తొలి 5 స్టార్ రిసార్టు

● వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబునాయుడు



వర్చువల్‌గా బై ది బే రిసార్టును ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

తీర ప్రాంతం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందడంతో పాటు ప్రత్యేక గుర్తింపు రావడానికి రిసార్టులు ఎంతగానో దోహదం చేస్తాయని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్లలో నూతనంగా నిర్మితమైన తొలి 5 స్టార్ గోల్డెన్‌శాండ్స్ బై ది బే రిసార్టును విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి సీఎం శనివారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా రిసార్టు విశేషాలను నిర్వాహకులు సీఎంకు వివరించారు. అత్యాధునిక 5 స్టార్ సదుపాయాలతో 147 గదులు, వెయ్యి మందికి పైగా సామర్థ్యం ఉండే లాన్, 400 మందికి అనువైన బ్యాంకెట్ హాల్‌తో 10.75 ఎకరాల విస్తీర్ణంలో ఈ 5 స్టార్ రిసార్ట్ నిర్మితమైనట్లు నిర్వాహకులు సీఎంకు తెలిపారు. దాదాపు రూ.150 కోట్ల ఖర్చుతో నిర్మాణం జరిగిందని, 700 మంది వరకు ఇక్కడ ఉపాధి దొరుకుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాగంటి ఎస్టేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ యాగంటి దుర్గా ప్రసాద్‌రావు, రిసార్ట్ డైరెక్టర్ కన్యాధర రవీంద్రబాబు పాల్గొన్నారు. వర్చువల్ గా జరిగిన రిసార్ట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఇన్‌చార్జి జేసీ గంగాధర్ గౌడ్, ఆర్డీవో పి. గ్లోరియా, తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు

వీణా అవార్డ్సు నాటకోత్సవాల ప్రారంభం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సాహిత్య సంస్థ కళల కాణాచి, ఆర్ఎస్ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన వీణా అవార్డ్స్ 2025 నాటకోత్సవాలు శనివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రారంభమయ్యాయి. ఈ సభకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఆలపాటి మాట్లాడుతూ, కళా వైభవానికి తెనాలి కళాభిమానులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కళలకు, కళాకారులకు నిలయమైన తెనాలి పట్టణంలో ప్రతి ఏటా వారం రోజుల పాటు నాటకోత్సవాలను ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి నిర్వహిస్తున్నారని చెప్పారు. నాటకోత్సవాలను రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కూచిపూడి కళాకారిణి వెంకటలక్ష్మి శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో నాటక ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన మూడు నాటకాలు కళాభిమానులను అలరించాయి. కర్నూలు టీజీవీ కల్చరల్ అకాడమీ కళాకారులు శ్రీ వేంకటేశ్వర మహత్యం పద్య నాటకం ప్రదర్శించారు. శారదా ప్రసన్న రచించిన నాటకానికి రమణారెడ్డి దర్శకత్వం వహించారు. అనంతపురం లలిత కళా పరిషత్ కళాకారులు కాలభైరవ సంహారం పద్యనాటకం ప్రదర్శించారు. పోతులయ్య రచించిన ఈ నాటకానికి శ్రీరామగోవిందసాగర్ దర్శకత్వం వహించారు. వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ కళకారులు ప్రదర్శించిన నల్లత్రాచునీడలో సాంఘిక నాటకాన్ని పి.శ్రీనివాసరావు రచించి దర్శకత్వం వహించారు. నాటిక నిర్వాహకులకు కమిటీ అధ్యక్షుడు, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ ప్రదర్శన పారితోషికాలు అందజేశారు. కాగా, వీణా అవార్డ్స్ నాటకోత్సవాలతో రూపొందించిన విపంచి పుస్తకాన్ని ఆవిష్కరించారు. డబుల్ హర్స్ సంస్థ ఎండీ మున్నగాల మోహన్‌శ్యాంప్రసాద్, నాటక రచయిత మృత్యుంజయరావు, రంగస్థల కళాకారుల సంఘ కార్య నిర్వాహక అధ్యక్షుడు గురిపాటి సుబ్బారావు, అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, చెరుకుమల్లి సింగారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



విపంచి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి, సాయిమాధవ్ తదితరులు

విద్యార్థిని మృతి కేసును
సీబీఐకి అప్పగించండి

● గుంటూరు ఎస్పీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ పాలిటెక్నిక్ విద్యార్థిని మృతి ఘటనకు సంబంధించి 2017లో గుంటూరు, నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో దాఖలైన కేసు దర్యాప్తులో పురోగతి లేకపోవడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. విద్యార్థిని మృతి విషయంలో పోలీసులు పరస్పర విరుద్ధ వివరాలను కోర్టు ముందు ఉంచడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించడమే సముచితమని అభిప్రాయపడింది. సీబీకి ఆదేశాలు ఇచ్చే ముందు కేసు దర్యాప్తు పురోగతిపై వాస్తవాలు పేర్కొంటూ అఫిడవిట్ వేయాలని గుంటూరు జిల్లా ఎస్పీని ఆదేశించింది. కేసుపై తదుపరి విచారణను అక్టోబర్ 6కి వాయిదా వేసింది. గుంటూరు జిల్లా గోపాయపాలెంకు చెందిన గర్నెపూడి శ్రావణ సంధ్య (17) బుడంపాడులోని ఓ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతూ 2017లో అనుమానాస్పద రీతిలో మృతిచెందింది. శ్రావణ సంధ్య హాస్టల్‌లోని 4వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందిందని హాస్టల్ వార్డెన్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. ఈ ఘటనపై గుంటూరు జిల్లా, నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఆధారంగా పరిశీలిస్తే వసతి గృహం నాలుగో అంతస్తు నుంచి యువతి ప్రమాదవశాత్తు పడిపోయిందని, ఆ సమయంలో ఎవరూ లేరని పోలీసులు కోర్టు ముందు ఉంచిన వివరాలలో పేర్కొన్నారని గుర్తు చేసింది. అయితే తన కుమార్తెను హత్య చేశారని, పోలీసులు కేసును సక్రమంగా దర్యాప్తు చేయడం లేదని పేర్కొంటూ మృతురాలి తల్లి హైకోర్టును ఆశ్రయించారు. ఘటనపై సీఐడీ లేదా సీబీఐ దర్యాప్తుకు ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా పోలీసులు సమర్పించిన వివరాలను పరిశీలించారు. విద్యార్థిని మృతి విషయంలో పరస్పర విరుద్ధ వివరాలను కోర్టు ముందు ఉంచడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు.

పెదకాకాని మల్లేశ్వరుని దర్శించిన
మంత్రి సుభాష్

పెదకాకాని, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవ స్థానాన్ని ఆంధ్రప్రదేశ్ కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం దర్శించారు. ఆలయ అధికారులు, అర్చకస్వాములు, వేదపండితుల వేద మంత్రోచ్ఛారణలు, మేళతాళాలతో ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం కుంకుమ పూజలు, రాహుకేతు పూజలలో మంత్రి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, వేద పండితులు ఆయన్ను సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని, చిత్ర పటాన్ని అందజేశారు. దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమీషనర్ ఎస్ ఎస్. చంద్రశేఖర అజాద్ దంపతులు శ్రీ స్వామి, అమ్మవార్లను శనివారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలికారు. మల్లేశ్వర స్వామికి, భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు.

తెలీదు.. గుర్తులేదు.. సంబంధం లేదు

పోలీసుల విచారణలో పిన్నెల్లి సోదరుల సమాధానం

మాచర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి మండలం, గుండ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జవిశెట్టి సోదరుల జంట హత్య కేసులో నిందితులైన మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిలు శనివారం జరిగిన పోలీసుల విచారణలో మాకు తెలీదు.. గుర్తులేదు.. సంబంధం లేదు.. అనే సమాధానాలిచ్చారు. మాచర్ల సర్కిల్ కార్యాలయంలో విచారణ అధికారి మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, గురజాల డీఎస్పీ జగదీష్ సమక్షంలో పిన్నెల్లి సోదరులు హైకోర్టు న్యాయవాదులు మనోహర్‌రెడ్డి, రామలక్ష్మారెడ్డిలతో కలిసి విచారణకు హాజరయ్యారు. ఉదయం 10:30 గంటలకు సర్కిల్ కార్యాలయానికి చేరుకోగా రాత్రి 9 గంటల వరకు విచారణ కొనసాగింది. ముందుగా మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని విచారించారు. అనంతరం సాయంత్రం అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిని ప్రశ్నించారు. ఇరువురు ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితులతో మాట్లాడినట్లు గుర్తించిన పోలీసులు దానిపై ప్రశ్నించినా ఆ ఫోన్లు మేము వాడలేదు.. ఎవరు వాడారో మాకు తెలీదు అంటూ సమాధానాలిచ్చారు. విచారణ అనంతరం పోలీసులు రాత్రి 9 గంటలకు పిన్నెల్లి సోదరులను సర్కిల్ కార్యాలయం నుంచి పంపించారు. పోలీసులు ఇచ్చిన నోటీసుల మేరకు విచారణ ముగిసినప్పటికీ ఈ కేసులో మరింత సమాచారం కోసం మరోసారి పిన్నెల్లి సోదరులను విచారణకు పిలిచే అవకాశం లేకపోలేదు.

రైల్వేట్రాక్ పెట్రోలింగ్
కట్టుదిట్టం


● నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంచారం పెరగడంతో ఒక్కో టీంలో ముగ్గురు కార్మికులు
● సిబ్బంది భద్రత కోసం ప్రత్యేక పరికరాలు

గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో రైల్వే సిబ్బందికి విధులు నిర్వహించడమంటే కత్తి మీద సాములాంటిదే. సింగిల్ ట్రాక్ మాత్రమే ఉన్న ఈ ఘాట్ సెక్షన్‌లో వన్యప్రాణుల సంచారం అధికంగా ఉంటుంది. పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు వంటివి హఠాత్తుగా ట్రాక్ పైకి వచ్చేస్తుంటాయి. ఇటీవలకాలంలో రైలు ఢీకొని వన్యప్రాణులు మృతి చెందిన ఘటనలు కూడా చోటు చేసుకొన్నాయి. ఇదే సమయంలో ట్రాక్‌పై ముఖ్యంగా రాత్రి వేళ విధులు నిర్వహించే సిబ్బందికి ఆయా జంతువులు తారసపడ్డాయంటే ఇబ్బందికరమే. ఈ పరిస్థితిని అధిగమించేందుకు డివిజనల్ రైల్వే అధికారులు ఒకరిద్దరిని కాకుండా రాత్రివేళ పెట్రోలింగ్ డ్యూటీలో ముగ్గురిని పంపాలని నిర్ణయించారు. దీని వల్ల సిబ్బంది భద్రత పెరుగుతుందని అధికారులు తెలిపారు. దిగువమెట్ట-చలమ మధ్యన 16 కిలోమీటర్ల రైలు మార్గం నల్లమల అటవీ ప్రాంతంలో నుంచి ఏర్పాటై ఉంది. దీనిని మూడు విభాగాలుగా చేసి సిబ్బందికి డ్యూటీలు వేశారు. రాత్రి వేళ డ్యూటీకి వెళ్లే సిబ్బంది కచ్చితంగా రెట్రో రిఫ్లెక్ట్ జాకెట్లు ధరిస్తారు. అలానే జంతువులు కొంచెం దూరంలో కనిపించగానే డ్రమ్ములు, తంబూరాలు వాయిస్తారు. అలానే టపాసులు పేలుస్తారు. కాగడాలు వెలిగించడం వంటివి చేసి బెదరగొడతారు. ఉదయం షిఫ్టులో ఇద్దరు కార్మికులు విధులు నిర్వహిస్తారు. వీళ్ల కూడా ఆయా పరికరాలను కలిగివుంటారు.

రైళ్ల రాకపోకలు సురక్షితంగా సాగేందుకే..

● రైల్వే ప్రజాసంబంధాల అధికారి

రైళ్ల రాకపోకలు సురక్షితంగా సాగేందుకు, ప్రయాణికుల భద్రతకు వీలుగా ఈ మార్పులు చేసినట్లు రైల్వే ప్రజాసంబంధాల అధికారి డీ వినయ్‌కాంత్ తెలిపారు. వర్షాకాలంలో హఠాత్తుగా వాగులు పొంగి నీరు రైలుమార్గాలపైకి వచ్చేస్తుంటుంది.ఆ సమయంలో ట్రాక్ దెబ్బతినే అవకాశం ఉందన్నారు. 24 గంటల పెట్రోలింగ్ డ్యూటీల వల్ల ఏదైనా సమస్య తలెత్తినా వెంటనే రైళ్లను నిలిపేసి మరమ్మతులు చేయించడానికి వీలు కలుగుతుందన్నారు. అలానే రాబోయే శీతాకాలంలో దట్టమైన పొగమంచు వల్ల కూడా సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకొంటున్నామన్నారు.



నల్లమల అటవీ ప్రాంతంలో రైలుమార్గంపై రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది



ఉదయం పెట్రోలింగ్ చేస్తున్న సిబ్బంది

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



శివాజీచౌక్‌లో అమ్మవారి పూజల్లో పాల్గొన్న కేంద్రమంత్రి పెమ్మసాని

ప్రజలకు అమ్మవారి అనుగ్రహం మెండుగా ఉండాలి

● కేంద్ర మంత్రి పెమ్మసాని

తెనాలి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలందరికి అమ్మవారి అనుగ్రహం మెండుగా ఉండాలని, అభివృద్ధి, సంక్షేమం దిశగా నడుస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శివాజీచౌక్‌లో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో శనివారం ఆయన అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గుమ్మడి రమేష్, కార్యదర్శి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, పలువురు పార్టీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి విచ్చేసిన కేంద్ర మంత్రికి కమిటీ ప్రతినిధులు పెండేల వెంకట్రావు, తాతా శ్రీనివాసరావు, పలువురు ప్రముఖులు స్వాగతం పలికారు. అమ్మవారికి ఆయన పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు ఆశీర్వదించి ప్రసాదాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, పట్టణంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజలు వైభవంగా జరుపుకోవడాన్ని అభినందించారు. విజయదశమి పండుగ ప్రజలందరికి మంచి జరగాలని, రాక్షస సంహారం చేసిన అమ్మవారిని ప్రతి ఒక్కరూ కొలుచుకోవడం దసరా ఉత్సవాలు ఘనంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఆలయంలో ఏర్పాట్లు బాగా చేశారని కమిటీ ప్రతినిధులను అభినందించారు.

హార్వెస్ట్ ఇండియా సామాజిక సేవలు అభినందనీయం

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హార్వెస్ట్ ఇండియా సమాజానికి అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. హార్వెస్ట్ ఇండియా వ్యవస్థాపకులు కత్తెర సురేష్‌కుమార్ పుట్టిన రోజు పురస్కరించుకుని శనివారం మార్కెట్ సెంటర్‌లో పారిశుధ్య కార్మికులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసిన ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు. తెనాలి పట్టణంతో పాటు డివిజన్‌లోని పలు గ్రామాల్లో విస్తృతమైన సేవలు అందిస్తున్నారని, ఎన్నో ఏళ్లుగా సమాజానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, సమాజంలో బలహీన వర్గాలను ఆదుకోవాలనే ఆలోచన అభినందనీయమని, ఇది ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. సుద్దపల్లి నాగరాజు, మహ్మద్ ఖుద్దూస్, నలుకుర్తి రమేష్, మల్లవరపు విజయ్, త్రిమూర్తి పాల్గొన్నారు.



పారిశుధ్య సిబ్బందికి నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి, ఎమ్మెల్యే ఆనందబాబు, సురేష్‌కుమార్

మహిళల ఉపాధికి వృత్తి శిక్షణ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు వృత్తి శిక్షణ దోహదపడుతుందని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి చెప్పారు. రూరల్ మండలం కొలకలూరులో శ్రీశక్తి వర్క్‌షాప్ శనివారం మహిళల నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. బ్యాగుల తయారీ, పచ్చళ్ల తయారీ, కారపుపొడి ప్యాకెట్లు, ఎంబ్రాయిడరీ, కుట్లు, అల్లికలు వంటి వృత్తులు కుటుంబ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుస్తాయని చెప్పారు. డ్వాక్రా గ్రూపుల ద్వారా మహిళలు రుణాలు పొంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ పీడీ బి.శైలజ, సునీత, జయశ్రీ, నవ్య, మౌనిక, ప్రశాంతి, స్వర్ణకుమారి పాల్గొన్నారు.

యువత ఉపాధి కల్పనకు నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉపాధి కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి చేస్తుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు చెప్పారు. వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 19 కంపెనీలు 722 మంది నిరుద్యోగుల సర్టిఫికెట్లు, నైపుణ్యాలు పరిశీలించి 344 మందికి ఉద్యోగ అవకాశాలు అందించారు. నియామక పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యువతీ యువకులలో నైపుణ్యాలు పెంపొందించి వారికి పలు కంపెనీలలో ఉద్యోగాలు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, కళాశాల దశలోనే విద్యార్థులు నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కెవి గోపాలకృష్ణ, ఎంపీడీవో అత్తోట దీప్తి, విజయలక్ష్మి, కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ ప్రసంగించారు.



జాబ్‌మేళాలో నియామకపత్రాలు అందుకున్న యువతీ, యువకులతో కమిషనర్, తహసీల్దార్, నైపుణాభివృద్ధి సంస్థ అధికారులు

మున్సిపల్ కార్యాలయం వద్ద సచివాలయ ఉద్యోగుల నిరసన

తెనాలి క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణ సచివాలయ ఉద్యోగులు శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించి మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం వలంటరీ వ్యవస్థను రద్దు చేసింది. దీనితో ఉన్న కొద్దిపాటి సిబ్బందిపై అధిక భారం పడుతుంది. సర్వేలు, మల్టీ టాస్కింగ్ ఒత్తిడి, మహిళా సిబ్బందిపై సామాజిక వేధింపులు, దివ్యాంగులైన సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రమోషన్లలో ఆలస్యం, యుఎల్‌బి ఖాళీలలో కనీసం 50 శాతం సచివాలయ సిబ్బందితో భర్తీ చేయించాలి తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సచివాలయ ఉద్యోగులు ఇన్‌చార్జి కమిషనర్ శ్రీకాంత్‌కు అందించారు.

కృష్ణానదిలో కొనసాగుతున్న వరద ఉధృతి

కొల్లిపర, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజి నుంచి 3 లక్షల 55 వేల 761 క్యూసెక్కుల పైగా నీటిని శనివారం కృష్ణానది దిగువకు విడుదల చేయడంతో వరద ఉధృతి కొనసాగుతోంది. రేవుల్లోకి ఎవరూ వెళ్ళవద్దని డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఎస్ఐ కోటేశ్వరరావు హెచ్చరికలు జారీ చేశారు. మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, కొల్లిపర, బొమ్మువానిపాలెం, అన్నవరం గ్రామాల్లోని రేవులను రెవెన్యూ, పోలీసు అధికారులు సందర్శించి వరద ఉధృతిని పరిశీలించారు. కృష్ణానది గ్రామాల సమీపంలో వరద ఉధృతి యధావిధిగా కొనసాగడంతో కృష్ణానదిలోకి ఎవరూ వెళ్ళవద్దని, తగిన జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. పడవ నడిపే జాలర్లకు తగిన జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు.

14వ వార్డులో పారిశుధ్య పనులు తనిఖీ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 14వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మొవ్వా యేసుబాబు శనివారం పరిశీలించారు. వీధుల శుభ్రత, సైడ్ కాల్వల్లో వ్యర్థాల తొలగింపు వంటి పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

16వ వార్డులో స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 16వ వార్డులో స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మహిళ వైద్య శిబిరాన్ని కౌన్సిలర్ దివి అనిత ప్రారంభించారు. వైద్యులు ప్రియాంక, మౌనిక, హనోక్, నిసర్గ, మధుబాబు, రమేష్, వైద్య సేవలు అందించారు. విజయగౌరి, శ్యాం, ఉమాకాంత్, బాలచంద్రమౌళి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



వీణా సంగీత మహోత్సవం చేస్తున్న బాలస్వామి



మారీసుపేటలో లలితాదేవి అలంకారం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని శనివారం వివిధ ఆలయాల్లో వివిధ రూపాల్లో అలంకరించారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో వాసవీ అమ్మవారిని వారాహిదేవిగా అలంకరించి ఉభయదాతలు పూజలు చేయించారు. చండీ హోమం నిర్వహించారు. రంగనాయకి శిష్యబృందం కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవాలను పర్యవేక్షించారు. మారీసుపేట శివాలయంలో పలువురు ఉభయ దాతల దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు. మిమిక్రీ ఆర్టిస్టు కె.కృష్ణంరాజు అద్భుతంగా ఇంద్రజాలం ప్రదర్శించారు. దేవీచౌక్ రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారిని మహాదుర్గాదేవిగా అలంకరించి భక్తులు పూజలు చేశారు. పొత్తూరి ఆదిలక్ష్మి సంకీర్తన బృందం భక్తిగీతాలు ఆలపించారు. రామలింగేశ్వరపేటలో, అప్పలస్వామి ఆలయంలో అమ్మవారిని లలిత త్రిపురసుందరి దేవిగా, శివాజీచౌక్, పాత శివాలయంలో అమ్మవారిని గాయత్రిమాతగా, దేవీచౌక్‌లో మహాదుర్గగా అలంకరించారు. చంద్రబాబు కాలనీలోని విజయదుర్గా ఆలయంలో మహిళలు కుంకుమార్చనలు చేశారు. సుల్తానాబాద్, చినరావూరు శివాలయం, పెదరావూరు, నందివెలుగు, సంగం జాగర్లమూడి ఆలయాల్లో విశేష పూజలు చేశారు.




లలితా దేవిగా పూజలు అందుకున్న కోదండ రామాలయంలోని అమ్మవారు

● పొన్నూరుటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నవరాత్రి మండపాలు, అమ్మవారి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణ శివారులోని జీబీసీ రోడ్డులో ఉన్న కనకదుర్గ భవాని ఆలయంలో అమ్మవారు లలితాదేవిగా పూజలు అందుకుంది. లలితాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని వీక్షించేందుకు మహిళలు ఆలయానికి బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయంలో సామూహిక కుంకుమార్చన జరిగింది. పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన నవరాత్రి మండపంలోని అమ్మవారు లలితా దేవిగా, శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి ఆలయంలోని పార్వతీదేవి, భావనారాయణ స్వామి ఆలయంలోని కాశీ విశాలాక్షమ్మ, శ్రీ తోటమ్మ తల్లి, నిడుబ్రోలు రాజరాజేశ్వరి దేవి, చింతలపూడి భ్రమరాంబాదేవి తదితర ఆలయాల్లోని అమ్మవారితో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నవరాత్రి మండపాల్లో అమ్మవారు లలితా దేవిగా ప్రత్యేక పూజలు అందుకుంది.



కొల్లిపర శ్రీజనార్ధనస్వామి ఆలయంలో శ్రీలలితాదేవి అలంకరణలో అమ్మవారు

● కొల్లిపర, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవరోజు శనివారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. కొల్లిపర శ్రీ జనార్ధనస్వామి ఆలయంలో శ్రీలలితాదేవి, శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీగాయత్రిదేవి, ఆర్యవైశ్యకల్యాణ మండపంలో శ్రీ లలితాత్రిపురసుందరిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, తూములూరు, హనుమాన్‌పాలెం, అన్నవరం, చివలూరు గ్రామాల్లోని శివాలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. భక్తులు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు.



మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు

● చేబ్రోలు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : శలపాడు గ్రామంలో దుర్గ భవాని ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారు రోజుకో అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు. వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.



ధైర్య లక్ష్మి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు

● పెదకాకాని, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భ్రమరాంబ అమ్మవారు శనివారం లలిత త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో దసరా ఉత్సవాలను సాంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తున్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల శ్రీ దశావతార వేంకటేశ్వరస్వామి వారి దివ్య క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో శనివారం అమ్మవారు ధైర్యలక్ష్మి అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు. నిత్యం ఆలయంలో జరిగే భక్తి కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు కోరారు.

సర్దార్ భగత్‌సింగ్‌కు ఘన నివాళి

తెనాలి క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన సర్దార్ భగత్‌సింగ్ యువత కోసం, దేశం కోసం చేసిన త్యాగాలు వెలకట్టలేనివని బీజేపీ పట్టణ సీనియర్ నాయకుడు అడపా సంపత్‌రాయుడు అన్నారు. దక్షిణ మండల బీజేపీ ఆధ్వర్యంలో శనివారం కొత్తపేటలో భగత్‌సింగ్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు చైతన్య మాట్లాడుతూ, తల్లి భారతి స్వేచ్ఛా వాయువులు కోసం అమరులైన భగత్‌సింగ్ ధన్యజీవి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు బిట్ర కనకదుర్గ, అన్నవరపు వేణు, కుశల్‌రాజ్ జైన్, తుమ్మల సాయి, మంచాల రత్నం, మారుతి శంకర్, జి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

● తెనాలి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. శివాజీచౌక్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ డివిజన్ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు మాట్లాడుతూ, దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమరయోధుల జీవిత గాథలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొల్లిముంత కృష్ణ, పాశం వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌పై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్‌పై తల్లిదండ్రులు కూడా శ్రద్ధ చూపాలని, కళాశాలకు వెళుతున్నారని, చదువుకుంటారనే ఆలోచనతో ఉండటం సరికాదని జేఎంజే కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ శాంత అన్నారు. కళాశాలలో శనివారం తల్లిదండ్రులు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల్లో సెల్‌ఫోన్ వినియోగం ఎక్కువగా ఉంటుందని, చదువును నిర్లక్ష్యం చేసినట్లు కనబడుతుందని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచి కోసం వినియోగించుకోవాలని, కానీ భవిష్యత్తు పాడుచేసేదిగా ఉండకూడదన్నారు. కళాశాలలో బోధన, సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రోజ్‌లీన్, అధ్యాపకులు విజయలక్ష్మి, సతీష్‌కుమార్, వనజ పాల్గొన్నారు.

ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బుర్రిపాలెం రోడ్డులోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల కమిటీ అధ్యక్షుడు బొల్లిముంత అమరేశ్వరరావు మాట్లాడుతూ, వేడుకలు విద్యా సంస్కృతిలో భాగమైనప్పటికీ విద్య పట్ల విద్యార్థులు నిర్లక్ష్యం చూపకూడదన్నారు. ప్రణాళికతో చదివి ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని కోరారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు స్వాగతం పలికారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చింతల శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ శివరామకృష్ణ, అధ్యాపకులు ప్రసంగించారు.

బాలుడి చికిత్సకు నగదు సాయం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : 28వ వార్డులో విద్యుదాఘాతానికి గురైన 9 ఏళ్ల బాలుడి చికిత్సకు రూ.30 వేలు నగదు సాయం అందజేశారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, యువజన నాయకుడు కోగంటి రోహిత్ చేతుల మీదుగా కుటుంబానికి నగదు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఖుద్దూస్, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, ఐటీడీపీ కార్యదర్శి మల్లవరపు విజయ్, కన్నయ్య, రమేష్, హర్ష పాల్గొన్నారు.

శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయానికి మహర్దశ

● రూ.11 కోట్లతో పలు శాశ్వత నిర్మాణాలకు ప్రణాళికలు



శ్రీమహంకాళీ అమ్మవారు

దుగ్గిరాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న భక్తుల సంఖ్యతో దినదిన ప్రవర్ధమానంగా వెలుగొందుతున్న శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయానికి మహర్దశ పట్టనుంది. ఆలయ పునర్నిర్మాణానికి దేవదాయ శాఖ రూ.99 లక్షలు, దాతల విరాళాలు రూ.3 కోట్లతో ఆలయ నిర్మాణం కొంతమేర పూర్తి చేశారు. రెండేళ్లపాటు మందకొడిగా సాగిన ఆలయ పునర్నిర్మాణం పనులు మంత్రి లోకేశ్ చొరవతో త్వరితగతిన పూర్తి చేశారు. మేనెల 4వ తేదీన అంగరంగ వైభవంగా జరిగిన ఆలయ పునఃప్రతిష్ఠకు వచ్చి అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర ఐటీ, విద్య, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటూ తొలివిడతగా రూ.5 కోట్లను మంజూరు చేశారు. మూడు నెలల్లో రూ.60 లక్షల ఆదాయం వచ్చిందని, 2025-26 ఆర్థిక సంవత్సరానికి రికార్డు స్థాయిలో రూ.2 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు ఈఓ కోగంటి సునీల్‌కుమార్ తెలిపారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారులు రూ.11 కోట్లతో రానున్న రెండేళ్లలో పలు నిర్మాణాలకు ప్రణాళిక రూపొందించారు. తొలివిడత మంజూరు చేసిన రూ.5 కోట్ల నిధుల్లో రూ.3.5 కోట్లతో ముఖమండపం, రూ.4 కోట్లతో ప్రహరీ, రూ.2 కోట్లతో ఆలయం పడమర వైపు ఐదు గదుల రాజగోపురం, భక్తులు, వాహనాలు ప్రదక్షిణ చేసేందుకుగానూ ప్రధాన సమస్య పరిష్కారం దిశగా ముందుగా రూ.15 లక్షలతో ఆలయం నలువైపులా సీసీ రోడ్డు, రూ.20 లక్షలతో భక్తుల కోసం ప్రత్యేక షెడ్డు, రూ.35లక్షలతో కేశఖండనశాల, రూ.30 లక్షలతో టాయిలెట్లు, రూ.20 లక్షలతో వాహన పూజాషెడ్డు, రూ.40 లక్షలతో దుకాణాలు, రూ.10 లక్షలతో ఆలయం చుట్టూ సీసీ కాలిబాట, రూ.20లక్షలతో అన్నదాన మండపం పనులు చేపట్టనున్నట్లు ఈఓ తెలిపారు.

జీఎస్‌టీ తగ్గింపు ఫలాలు సామాన్యులకు అందాలి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టి ఫలాలు ప్రతి వినియోదారుడు కి అందాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు అన్నారు. పొన్నూరు పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం సూపర్ జీఎస్‌టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీతగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. వినియోదారులు దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేసిన సమయంలో జీఎస్‌టీ తగ్గింపులపై ప్రశ్నించాలని సూచించారు. దుకాణ యజమానులు కూడా జీఎస్‌టీ తగ్గింపుల వివరాలను బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు తెలియచెప్పాలని సూచించారు. కార్యక్రమంలో స్టేట్ టాక్స్ గుంటూరు జాయింట్ కమిషనర్ ఎస్ ప్రసాదరావు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించే వరకు ఆందోళనలు

● సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు

పెదకాకాని, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కరించే వరకు దశల వారీగా ఆందోళన చేపడతామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు తెలిపారు. సీపీఎం మండల విస్తృత సమావేశం శనివారం పెదకాకాని సీపీఎం మండల కార్యాలయంలో మండల కమిటీ సభ్యులు కె.ఆదాం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ కాలనీలలో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని, స్వచ్ఛమైన ఫిల్టర్ చేసిన తాగునీరు అందించాలని, ఇళ్ల స్థలాల సమస్యపై భవిష్యత్తులో దశల వారి ఆందోళన చేపడతామని అన్నారు. సీపీఎం నంబూరు గ్రామ శాఖా కార్యదర్శి ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ నంబూరు గ్రామంలో ఊరికి నాలుగు పక్కల రహదారులకు చప్టాలు ఉన్న చోట హై లెవెల్ బ్రిడ్జిలు నిర్మించాలన్నారు ఈ కార్యక్రమంలో జి.రాజా రమేష్, బి.సాంబయ్య, ఎస్.నీలాంబరం, కే సత్యనారాయణ పాల్గొన్నారు.



మృతుల కుటుంబాలకు బీమా పరిహారం నగదు అందజేస్తున్న ఛైర్మన్ నరేంద్ర కుమార్

సంగం ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం

● ఛైర్మన్ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సంగం పాల రైతులతో పాటు ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా పాలకవర్గం పనిచేస్తుందని సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. వడ్లమూడి సంగం డెయిరీలో శనివారం డీవీసీ అభయ పథకంలో భాగంగా మృతుల కుటుంబాలకు పరిహారాన్ని ఛైర్మన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. డీవీసీ అభయ పథకంలో అంతర్భాగమైన సిబ్బంది పదవీ విరమణ ప్రయోజన పథకంలో చేరి మృతి చెందిన 57 మంది ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.14.25 లక్షలు పరిహార నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ సంగం పాలక వర్గం పాల రైతుల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. అలాగే సంగం అభివృద్ధిలో భాగస్వాములైన ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలవాలని డీవీసీ అభయ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కంచర్ల శివరామయ్య, పోపూరి శేషగిరి కుమారి, ఎండీ పి.గోపాలకృష్ణ, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ పి.అనిల్ కుమార్, పీఆర్‌వో కే.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పాల రైతులకు బోనస్ పంపిణీ

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాల రైతుల ఆర్థిక అభివృద్ధికి సంగం పాలకవర్గం పాటు పడుతుందని ఆ సంస్థ పాలకవర్గ సభ్యులు బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని కొండమూది పాల సొసైటీ పరిధిలో 57 మంది పాల రైతులకు రూ.95,363 బోనస్‌ను శనివారం పంపిణీ చేశారు. అలాగే జడవల్లి గ్రామంలో సుప్రియ వెండార్ పాయింటులో 19 మంది పాల రైతులకు రూ.32,468 బోనస్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జోనల్ మేనేజర్ వీరేంద్ర కుమార్, సూపర్వైజర్ బాలకిషోర్, పాలకవర్గ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వీఐటీలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

చేబ్రోలు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలులోని ఆర్వీఐటీ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తగా చేరిన విద్యార్థులకు సీనియర్లు ఆహ్వానం పలుకుతూ సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నృత్యాలతో సందడి చేశారు. విద్యార్థులు వివిధ పోటీలు నిర్వహించుకుని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్వీ కృష్ణయ్య మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే వంటి వేడుకలు కొత్త విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచుతాయని, సీనియర్లతో అనుబంధాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మల్లికార్జున విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నూతనంగా టెక్నాలజీలో వస్తున్న మార్పులకి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుని మంచి ఉద్యోగాలు సంపాదించాలని ఆకాంక్షించారు.

మహిళలు మెడికల్ క్యాంపులను సద్వినియోగించుకోవాలి : సర్పంచ్

కొల్లిపర, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులను మహిళలు సద్వినియోగించుకోవాలని సర్పంచ్ పిల్లి రాధిక అన్నారు. మండల కేంద్రం కొల్లిపరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సచివాలయం-1 పరిధిలో శనివారం నిర్వహించిన స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని, తగిన జాగ్రత్తగా ఉండాలన్నారు. మండల వైద్యాధికారి నీహ మాట్లాడుతూ మెడికల్ క్యాంపుల్లో పాల్గొన్న మహిళలకు వివిధ రకాలకు చెందిన వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వైద్యాధికారులు నీహ, అర్చన రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, ఎఎన్ఎంలు, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ క్యాంపులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఘనంగా శ్రీగంగానమ్మతల్లి సారె సమర్పణ ఉత్సవం

దుగ్గిరాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామం చిలువూరులో ఉన్న శ్రీగంగానమ్మ దేవాలయ 13వ వార్షిక ఉత్సవాలు ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు సూక్తమహాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ శాశ్వత కైంకర్యపరులు డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు ఇంటి నుంచి పలురకాల పుష్పాలతో అలంకరించిన వాహనాల్లో 125 రకాల చీరెలు, పూలు, పండ్లు, పసుపు, కుంకుమలను ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి సమర్పించారు. కేరళ సంప్రదాయ డప్పులు, అమ్మవారి పాటలకు గ్రామవీధుల్లో యువనృత్యకళాకారిణులు, కేరళ సాంస్కృతిక బృందంచే డప్పువాద్యాలతో కొనసాగిన ఊరేగింపుతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పసుపునీటి అభిషేకాలు, ఊరేగింపు కార్యక్రమాల్లో డాక్టర్ జగదీష్‌బాబు, సుభాషిణి దంపతులతోపాటు డాక్టర్ రమేష్‌బాబు, సురేష్‌బాబు కుటుంబసభ్యులు, సింగలూరి వీరన్న, పద్మజ్యోతి దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఆదివారం శ్రీగంగానమ్మతల్లి జాతర, పొంగళ్లు, కొలుపులు, వివిధ సంగీతవాద్య కళాకారులు గజరాజుతో హంసవాహనంపై త్రిశక్త్యాత్మక స్వరూపిణియైన శ్రీగంగానమ్మ అమ్మవారి ఉత్సవ మూర్తికి చిలువూరు గ్రామంలో ఊరేగింపు నిర్వహించనున్నారు.



గంగమ్మతల్లిని పసుపునీటితో అభిషేకిస్తున్న రంగిశెట్టి జగదీష్‌బాబు కుటుంబసభ్యులు

చేబ్రోలు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

చేబ్రోలు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పొన్నూరు నియోజకవర్గంలోని చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్‌హబ్‌లో సెప్టెంబరు 29వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీదేవి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో ఐటీసీ, ఎస్బిఐకార్డ్స్, ఎస్కే డిజిటల్స్, టాటా వంటి ప్రముఖ సంస్థలు పాల్గొననున్నాయి. 10వ తరగతి, ఇంటర్, డిప్లమా, ఐటిఐ, డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హతలు కలిగిన ఆసక్తి ఉన్న యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరింత సమాచారం కొరకు 9666545975లో సంప్రదించాలని తెలిపారు.


గుంటూరు రూరల్ వార్తలు

మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

లలితం..దివ్య స్వరూపం

శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. పలు ఆలయాల్లో శనివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను అనుగ్రహించారు. శ్రీ లలితా త్రిపురసుందరీ దేవిగా ఆరవ రోజు పలు ఆలయాల్లో అమ్మవార్లను అలంకరించారు. మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- మంగళగిరి, తాడికొండ, ప్రత్తిపాడు



తుళ్లూరు: లలితా త్రిపుర సుందరి దేవిగా దుర్గామాత



తాడికొండ: లలితా త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు



పెదనందిపాడు: లలితా త్రిపుర సుందరీదేవిగా సోమేశ్వరాలయంలో అమ్మవారు



మంగళగిరి: రాజరాజేశ్వరి దేవిగా కనకదుర్గమ్మ



మంగళగిరి: సంతాన లక్ష్మిగా రాజ్యలక్ష్మీ



కాకుమాను: లలితాదేవిగా భువనేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు



దుగ్గిరాల: శ్రీలలితాత్రిపురసుందరీదేవి మహంకాళీ



దుగ్గిరాల: వారాహిదేవి అలంకారంలో అమ్మవారు

ఉపాధి హామీ పథకం.. సామాజిక తనిఖీ

తుళ్లూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్)ని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులు శనివారం ప్రారంభించారు. 2024-25 సంవత్సరానికి గాను 17వ రౌండ్ సామాజిక తనిఖీ చేస్తున్నారు. మండలంలో రూ.2.60 కోట్ల పనులు జరిగాయి. అక్టోబరు 10వ తేదీ వరకు సామాజిక తనిఖీలు అధికారులు నిర్వహిస్తారని మండల ఏపీఓ నాగరాజు ఈ సందర్భంగా తెలిపారు .

'చలపతి'లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

తాడికొండ (మోతడక) సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మోతడక చలపతి ఇంజ నీరింగ్ కళాశాలలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం విద్యార్థులు, అధ్యా పకులు ఘనంగా నిర్వహి ంచారు. విద్యా సంస్థల చైర్మన్ వైవీ అంజనేయులు మాట్లా డుతూ సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం వల్ల భారతదేశ సాంప్రదాయాలు పాటిస్తున్నారన్నారు. ఏఐ కృత్రిమ మేధతో బొమ్మల కొలువు కార్యక్రమాన్ని విభిన్నంగా నిర్వహించారు. వివిధ విభాగాల విద్యార్థులు బతుకమ్మ, కోలాటం, మెహందీ, మ్యూజికల్ చైర్స్, పలు పోటీలను నిర్వహించారు. కళాశాల కోశాధికారి వై.అనంతకుమారి, ప్రిన్సిపాల్ కె.నాగశ్రీనివాసరావు డీన్స్ డాక్టర్ వీవీ సుబ్బారావు, డాక్టర్ పి.బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.



బోనాలు తీసుకువస్తున్న విద్యార్థినులు

అనంతవరంలో.. ప్రజాభిప్రాయ సేకరణ

తుళ్లూరు, (అనంతవరం) సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణ మండలి అధికారులు అనంతవరం క్వారీ ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సును శనివారం నిర్వహించారు. రాజధాని నిర్మాణ పనుల కోసం బిల్డింగ్ స్టోన్, రోడ్ మెటల్, బల్లాస్ట్ రఫ్ స్టోన్ మాన్యుఫ్యాక్చర్ శాండ్, మొర్రం(గ్రావెల్)ను అనంతవరం కొండ ప్రాంతం సర్వే నంబరు 221లో 10.50 హెక్టార్లలో క్వారియింగ్ చేయడానికి వైట్ల శ్రీనివాస్, కాటంనేని ఉమమహేశ్వరావు అనుమతులకు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై కలెక్టర్‌కు నివేదించడానికి డీఆర్వో ఖాజావలి, కాలుష్య నియంత్రణ మండలి అధికారి నవీనబేగం ప్రజాభిప్రాయాలను సేకరించారు. వ్యవసాయం లేనిమీదట స్థానికులకు క్వారీ పనుల్లో ఉపాధి కల్పించాలని, మెటల్ తరలించే లారీలు గ్రామాలలో ఓవర్ స్పీడ్ వెళ్లకుండా నియంత్రించాలని ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు హరిబాబు అనంతవరం పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ పాల్గొన్నారు.

స్టడీ సర్కిళ్ల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 13 బీసీ స్టడీ సర్కిళ్లలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. ఈ మేరకు శనివారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితను కలిసి వినతి పత్రం అందజేశారు. శంకరరావు మాట్లాడుతూ స్టడీ సర్కిళ్లను నమ్ముకుని పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, డెయిలీ వేజెస్ ఉద్యోగులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, గత పదేళ్లకు పైబడి పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సిబ్బంది 2022 పీఆర్‌సీ ప్రకారం జీతభత్యాలను పెంపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, ప్రతి బీసీ స్టడీ సర్కిల్‌కు రెగ్యులర్ ప్రాతిపదికన డైరెక్టర్ పోస్టు నియామకం జరపాలన్నారు. శిక్షణ భృతిని రూ.1500లను రూ.4,500లకు పెంచాలన్నారు. బీసీ స్టడీ సర్కిళ్ల ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు, కార్యదర్శి రామకృష్ణ, సూరిబాబు, పి.పురుషోత్తం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న కేసన శంకరరావు

ముగిసిన కిసాన్ మహోత్సవ్-2025

తాడేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు సాధికార సంస్థ సహకారంతో రెండు రోజులుగా కేఎల్ యూనివర్సిటీలో జరుగుతున్న కిసాన్ మహోత్సవ్-2025 కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో అత్యంత ప్రతిభ కనబరిచిన రైతులు, శాస్త్రవేత్తలు, జర్నలిస్టులు, డిజిటల్ మీడియా వ్యవస్థాపకులు, మొబైల్ అప్లికేషన్ నిర్వాహకులు, ప్రముఖులకు 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి అవార్డులు అందజేశారు. శనివారం సేంద్రియ వ్యవసాయంలో అత్యంత ప్రతిభ కనబరిచిన రైతులు, వారిని ప్రోత్సహించిన అధికారులకు అవార్డులను ముఖ్య అతిథి బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రదానం చేశారు. అగ్రి మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, కళ్లం రాజశేఖర్‌రెడ్డి, శివసాంబిరెడ్డి, నూతలపాటి రామారావు, టీడీపీ వాణిజ్య విభాగం కార్యదర్శి రామ్‌ప్రసాద్, ఏరువాక ఫౌండేషన్ చైర్మన్ గారా రాఘవరావు, స్టేట్ ఎంఎస్ఎంఈ చైర్మన్ పి.శివశంకర్, సోమశేఖర్, గ్రీన్ మ్యాంగోస్ ఎండీ శృతి, సైంటిస్ట్ డాక్టర్ మాధవి వేగుళ్ళ, అగ్రికల్చర్ డైరెక్టర్ డాక్టర్ పి.రత్నప్రసాద్, హెచ్‌వోడీ బాలకృష్ణ పాల్గొన్నారు.



రైతును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

పశ్చిమ డెల్టాకు..

దుగ్గిరాల,సెప్టెంబరు 27(ఆంధ్ర జ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 1356, తూర్పు కాల్వకు 152, పశ్చిమ కాల్వకు 194 , నిజాంపట్నం కాల్వకు 366, కొమ్మమూరు కాల్వకు 1,873 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

జీఎస్‌టీపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఫిరంగిపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీపై ఇంటింటికి వెళ్ళి అవగాహన కల్పించాలని జీఎస్‌టీ సహాయ కమిషనర్ నల్లపాటి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఫిరంగిపురం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన జీఎస్‌టీ 2.0 అవగాహన కార్యక్రమలో ఆయన మాట్లాడారు. సామాన్య ప్రజలు కిరాణా దుకాణాల్లో, మార్టుల్లో, తగ్గిన జీఎస్‌టీని గుర్తించేలా అవగాహన కల్పించాలన్నారు. వినియోగదారులందరికి జీఎస్‌టీ ప్రయోజనాలు చేకూరేలా అధికారులందరూ శ్రద్ధ వహించాలన్నారు. ఏఈ సీహెచ్ కల్యాణ్ కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె.రవి బాబు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారాన్ని విజయవంతం చేయండి: జంపని



మాట్లాడుతున్న జంపని హనుమంతరావు

పెదనందిపాడు,సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులపాడు ఉప మార్కెట్ యార్డులో ఆదివారం జరగనున్న ప్రమాణస్వీకార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు కోరారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ మండల అధ్యక్షుడిగా కోడూరి శ్రీరఘురామారావు(రాంబాబు), అబ్బినేనిగుంటపాలెం పీఏసీఎస్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార మహోత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య, నియోజకవర్గ పరిశీలకులు భీమినేని వందనాదేవి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొర్రపాటి నాగేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు పరాంకుశం శ్రీనివాసరావులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఏబీపాలెం అడ్డరోడ్ వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి వరగాని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి.. నాగులపాడు మార్కెట్ యార్డు వద్దకు చేరుకోనున్నట్లు తెలిపారు. ఎన్నారై టీడీపీ లాస్‌ఏంజెల్స్ అధ్యక్షుడు ఆళ్ల వెంకట్, గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య, చెన్నుపాటి సురేంద్ర, రామినేని శ్రీనివాసరావు, దివ్వి నాగరాజు, తుమ్మల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ సమాజ నిర్మాణానికి జాషువా కృషి

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కలమే ఆయుధంగా మూఢాచారాలపై తిరగబడిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సమసమాజ నిర్మాణానికి కృషి చేశారని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.నాగేశ్వరరావు అన్నారు. జాషువా జయంతిని పురస్కరించుకుని మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం ఆయన చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు నివాళులు అర్పించారు. విద్యార్థులు బహూకరించిన జాషువా చిత్రపటాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ యర్రగుంట్ల ప్రేమ్‌రాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా జయంతి వేడుకలు

పెదనందిపాడు,సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో గుర్రం జాషువా 130వ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దొప్పలపూడి రమేష్‌బాబు, ముద్దన వెంకటేశ్వర్లు, కాపు వెంకటసుబ్బారావు, పి భువనేశ్వరి, మర్రి లక్ష్మీ, షేక్ షమీ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై అవగాహన సదస్సు

తాడేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులు, లైంగిక వేధింపులు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని గుంటూరు జిల్లా ప్రొహిబిషన్ అధికారిణి, జిల్లా బాలల సంరక్షణ ఇంచార్జి వసంతి బొడ్లపాటి అన్నారు. స్థానిక కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్, కేఎల్ న్యాయ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే వర్సిటీలో కుమార్తెల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వర్సిటీ ఉమన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ రూత్‌రమ్య సమాజంలో ఆడపిల్ల పాత్ర చాలా గొప్పదన్నారు. వీసీ డాక్టర్ సారథివర్మ, ప్రోవీసీలు, డాక్టర్ వెంకట్రామ్, రాజశేఖరరావు, ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, ఉమన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ రూత్‌రమ్య పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

మంగళగిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నార్త్ సబ్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేయాల ని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. మంగళగిరిలోని నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించి, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణతో సమావేశమై కేసుల దర్యాప్తుపై సమీక్షించారు.

టీడీపీ మండలాధ్యక్షుడిగా కోడూరి



కోడూరి రఘురామారావు

పెదనందిపాడు, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడిగా కోడూరి రఘురామారావు(రాంబాబు)ను నియమించినట్లు ప్రత్తిపాడు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్యకు కోడూరి కృతజ్ఞతలు తెలిపారు. రాంబాబుకు టీడీపీ ఎన్నారై లాస్ ఏంజెల్స్ అధ్యక్షుడు ఆళ్ల వెంకట్, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, రామినేని చంద్రయ్య అభినందనలు తెలిపారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

తాడికొండ(లాం)సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహల కారణంగా.. బాలికలకు ఎన్నో అనర్థాలు ఎదుర్కొంటున్నారని.. ఫిరంగిపురం ప్రాజెక్టు సీడీపీవో ఎం.అనురాధ పేర్కొన్నారు. శనివారం లాం, తాడికొండ సెక్టార్ల పరిధిలో పోషణ మహోత్సవాలను నిర్వహించారు. అనురాధ మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యం జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కే.కృష్ణకుమారి, కే.సీతారావమ్మ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నగదు చెక్కు అందజేస్తున్న మధుసూదనరావు

తాడేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరానికి చెందిన వడ్డేశ్వరం పున్నయ్య అనారోగ్యంతో వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. తన ఇబ్బందిని మంత్రి నారా లోకేశ్‌కు తెలపడంతో.. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2లక్షలు మంజూరు చేయించారు. నగదు చెక్కును గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు కాట్రగడ్డ మధుసూదనరావు, గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య వైద్యశాలకు వెళ్లి పున్నయ్యకు నగదు చెక్కు అందజేశారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించవద్దు

కాకుమాను, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై అశ్రద్ధ వహించవద్దని కాకుమాను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ం వైద్యులు డాక్టర్ స్వర్ణ రాజశేఖర్ అన్నారు. స్థానిక విష్ణు ఆలయం ఆవరణంలో శనివారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహారం వల్ల రక్త హీనతను నివారించవచ్చని వెల్లడించారు. సీడీపీవో విజయలక్ష్మీ, కాకుమాను సెక్టార్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

డాన్ బోస్కోలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

మంగళగిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలోని డాన్‌బోస్కో పాఠశాల స్వర్ణోత్సవాలలో భాగంగా రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ శనివారం నుంచి ప్రారంభమైంది. మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య పోటీలను ప్రారంభించారు. డాన్‌బోస్కో పాఠశాల 50 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉమామహేశ్వరరావు, రమేష్‌బాబు, సత్యనారాయణ, అంకారావు, ప్రధానోపాధ్యాయిని రాణి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అవగాహన

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డ గ్రామంలో పార్టిసిపేటరి రూరల్ అప్రైసల్ (పీఆర్ఏ) టెక్నిక్స్‌లో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలు, వనరులు, గ్రామంలో లభించే అవకాశాలను అర్థం చేసుకునేందుకు వనరుల పటాలు, వెన్ రేఖాచిత్రాలను గీసి వాటి ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ వంగా నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

పెదనందిపాడు,సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని సర్పంచ్ మొవ్వా శ్రీదేవి అన్నారు. రావిపాడు గ్రామ సచివాలయం వద్ద శనివారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ వైద్యశిబిరం నిర్వహించారు. సీహెచ్‌వో ఎస్ఆర్ ప్రసాద్‌స్వామి, సూపర్‌వైజర్ జి.శ్రీనివాసరావు, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ సభ్యులు జి.అప్పయ్య పాల్గొన్నారు.

మేరిగపూడిలో వైద్య శిబిరం

ఫిరంగిపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేరిగపూడి ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారి సశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కంజుల పద్మావతి, బ్రహ్మారెడ్డి పాల్గొని ప్రారంభించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. పౌష్టికాహారంపై అవగాహన, ప్రదర్శన స్టాల్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సి.యానీగ్రేస్, సీహెచ్‌వో ఎం.వెంకట లక్ష్మి, ఎంపీహెచ్ఎస్ కే సుదర్శనరాజు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కె.చిన్నమ్మాయి తదితరులు పాల్గొన్నారు.

యువతలోని ప్రతిభకు హ్యాకథాన్లు దోహదం



విద్యార్థులను అభినందిస్తున్న పంకజ్

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : యువతలోని ప్రతిభను ప్రపంచానికి తెలియజే యటానికి ఈ హాక్‌థాన్‌లు అద్భుత వేదికగా నిలుస్తుందని ఐడియా ల్యాబ్స్ ఫౌండర్ పంకజ్ దివాన్ అన్నారు. మండలంలోని పుల్లడిగుంట గ్రామ సమీపంలోని మలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన హాక్‌థాన్ విజయవంతంగా ముగిసింది. జ్యూరీ సభ్యులు అరవింద కుమార్ విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు, డీఎస్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.హరికృష్ణ, డీన్ రమేష్ బాబు పాల్గొన్నారు.

ఆకతాయిల ఆట కట్టిస్తాం

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సీమల ప్రశాంత వాతావరణానికి భగ్నం కలిగించే ఆకతాయిల ఘర్షణలను ప్రజలకు చుట్టవద్దని, అలాంటి వారి పై ప్రత్యేక నిఘా పెట్టి ఉక్కుపాదం మోపుతామని సౌత్ డీఎస్పీ భానోదయ హెచ్చరించారు. మండలంలోని ముట్లూరు గ్రామంలో ఇటీవల రెండు సామాజిక వర్గాల మధ్య నెలకొన్న స్వల్ప ఘర్షణ వాతావరణ నేపథ్యంలో మండల కేంద్రం వట్టిచెరుకూరులో శనివారం పోలీసులు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి డీఎస్పీ భానోదయ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముట్లూరు గ్రామంలో ఇద్దరు ఆకతాయిలు రగిల్చిన స్వల్ప ఘర్షణను ఇరు సామాజిక వర్గాల పెద్దలు సమన్వయంగా వ్యవహరించి పోలీసుల దృష్టిలో పెట్టి పరిష్కారానికి ముందుకు రావటం, పోలీసు శాఖ తరుపున ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. సీఐ రమా నాయక్, డిప్యూటీ తహసీల్దార్ దరియావలి పాల్గొన్నారు.

కోతుల దాడిలో ఒకరికి గాయాలు

తుళ్లూరు సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తుళ్లూరులో కోతుల బెడద అధికంగా.. సినిమా హాలు సెంటర్‌లో చెరువుకట్ట మీద కూర్చున్న ఒకరిపై శనివారం కోతి దాడి చేసింది. అబ్బూరి సదా శివరావు కుడిచేతిని కొరకటంతో గాయమైంది. వాకింగ్ ట్రాక్‌లో గుంపులుగా సంచరిస్తూ కోతులు జనాన్ని హడలెత్తిస్తున్నాయి. పంచాయతీ సిబ్బంది కొండముచ్చును గ్రామంలో కొన్ని రోజులు తిప్పారు. ఆ తర్వాత పరిస్థితి కనబడ లేదు.